



# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు

సంపుటి : 1 సంచిక : 62 పేజీలు : 8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : కావలి, నెల్లూరుజిల్లా మంగళవారం 13 జనవరి 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 62 PAGES : 8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : KAVALI, NELLORE DIST, TUE 13 JANUARY 2026 PRICE : 1/- RS

Simultaneously Published form : ,SPSR Nellore, Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa, Hyderabad, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur


## పిఠాపురం సంక్రాంతి వేడుకలను కొనియాడుతూ పవన్ కల్యాణ్ స్పందన

- అద్భుతంగా జరిగిన పీఠికాపుర సంక్రాంతి మహోత్సవం
- మూడు రోజు పాటు జరిగిన వేడుకలు
- సంతోషాన్ని వ్యక్తం చేసిన పవన్ కల్యాణ్



సంక్రాంతి పండుగ సందర్భంగా పిఠాపురంలో మూడు రోజుల పాటు జరిగిన పీఠికాపుర సంక్రాంతి మహోత్సవం అద్భుతంగా సాగిందని, ఈ కార్యక్రమం విజయవంతమైందని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. ఈ వేడుకలకు పూర్తి సహకారం అందించిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా వేదికగా ఒక ప్రకటన విడుదల చేశారు."మొదటి రోజు సాంప్రదాయ కళలతో సందడి చేశారు. సత్యసాయి జిల్లా ఉరుముల కళారూపంతో ఎస్. వరప్రసాద్, కర్నూలు నుంచి గురవయ్యల కళాకారుడు జె. మల్లికార్జున, లంబాడీ నృత్యంతో జి. సునీత, కృష్ణా జిల్లా డప్పు కళాకారుడు వి. రాజీవ్ బాబు, శ్రీకాకుళం తప్పెటగుళ్ల కళాకారుడు కె. మల్లేశ్వర రావు, విజయనగరం

వివరాలు 2లో..




# నారావారిపల్లెకు సంక్రాంతి కళ తెచ్చిన సీఎం

### సంక్రాంతి సంబరాల కోసం నారావారిపల్లె చేరుకున్న సీఎం చంద్రబాబు...

- సంక్రాంతి వేడుకల కోసం స్వగ్రామానికి సీఎం చంద్రబాబు
- సొంతూరిలో చంద్రబాబుకు ఘనస్వాగతం
- కుటుంబ సభ్యులు, గ్రామస్థులతో కలిసి సంక్రాంతి పండుగ సంబరాలు
- పర్యటనలో పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు
- నాలుగు రోజుల పాటు స్వగ్రామంలోనే ముఖ్యమంత్రి బస



సంక్రాంతి వేడుకల్లో పాల్గొనేందుకు ఏపీ ముఖ్య మంత్రి చంద్రబాబు తన స్వగ్రామం నారావారిపల్లెకు చేరుకున్నారు. ప్రతి ఏటా కుటుంబ సభ్యులు, గ్రామస్తులతో కలిసి సంక్రాంతి పండుగ జరుపుకునే సీఎం చంద్రబాబు... ఆ ఆనవాయతీని కొనసాగిస్తూ ఈ ఏడాది కూడా స్వగ్రామానికి తరలివెళ్లారు. సోమవారం నాడు మంత్రులు, సెక్రటరీలు, కలెక్టర్లతో సచివాలయంలో సమీక్షా సమావేశం అనంతరం సాయంత్రం నారావారిపల్లెకు హెలికాప్టర్ లో పయనమయ్యారు. స్వగ్రామంలో ఆయనకు ఘనస్వాగతం లభించింది. గ్రామస్తులు, కుటుంబ సభ్యులు, కార్యకర్తలు, నేతలతో కలిసి రేపు సంక్రాంతి సంబరాల్లో పాల్గొంటారు. మంగళవారం నాడు నారావారిపల్లెతో పాటు తిరుపతిలో పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించడంతో పాటు శంకుస్థాపనలు చేస్తారు.

**ప్రాజెక్టుల ప్రారంభోత్సవాలు... శంకుస్థాపనలు**

మంగళవారం ఉదయం 8 గంటలకు గ్రామంలోని టీటీడీ కళ్యాణ మండపం ప్రాంగణంలో నిర్వహించే సంక్రాంతి సంబరాల్లో సీఎం పాల్గొంటారు. అనంతరం మధ్యాహ్నం శేషాచల లింగేశ్వర స్వామి దేవస్థానం వద్దకు వెళ్లనున్నారు. రూ.70 లక్షలతో రంగంపేట- భీమవరం రోడ్డు నుంచి శేషాచల లింగేశ్వర స్వామి ఆలయం వరకు నిర్మించిన రహదారిని ప్రారంభిస్తారు. నారావారిపల్లెలో 33/11 కేవీ సెమీ ఇండోర్ సబ్ స్టేషన్, రూ.1.4 కోట్లతో పరిశ్రమల అవసరాలకు తగినట్టుగా యువతకు శిక్షణ ఇచ్చేలా నిర్మించిన స్కిల్ బిల్డింగ్ సెంటర్, సంజీవని ప్రాజెక్టులను ప్రారంభి స్తారు. ఇక తిరుపతిలో రూ.45 లక్షలతో నిర్మించిన శ్రీ వెంకటేశ్వర రామ్‌నారాయణ్ రుయా ప్రభుత్వ ఆసుపత్రిలో పేషెంట్ అటెండెంట్ అమీనిటీస్ కాంప్లెక్స్, ఎస్వీ యూనివర్సిటీలో రూ.7.5 కోట్లతో నిర్మించిన బాయ్స్ హాస్టల్, రూ.5 కోట్లతో నిర్మించిన గర్ల్స్ హాస్టల్‌ను ముఖ్యమంత్రి ప్రారంభిస్తారు. మూలపల్లిలో నీటి సరఫరాకు సంబంధించి నీవా బ్రాంచ్ కెనాల్ నుంచి కళ్యాణి డ్యామ్‌కు, మూలపల్లి చెరువుతో పాటు మరో 4 చెరువులకు నీటిని తరలించేలా రూ.126 కోట్లతో చేపట్టే ప్రాజెక్టుకు, రూ.10 లక్షలతో పశువుల వసతి సముదాయానికి శంకుస్థాపన చేస్తారు. ఎస్వీ యూనివర్సిటీలో పరిశోధన, ఆవిష్కరణలకు ఊతం ఇచ్చేలా రూ.6 కోట్లతో

వివరాలు 2లో..

## నారావారిపల్లె చేరుకున్న మంత్రి నారా లోకేశ్ కు ఆత్మీయ స్వాగతం...



- ముఖ్యమంత్రి చంద్రబాబుతో కలిసి నారావారిపల్లె చేరుకున్న మంత్రి లోకేశ్
- రంగంపేట వద్ద తండ్రీకొడుకులకు ఘనస్వాగతం పలికిన నేతలు, ప్రజలు
- ఏటా స్వగ్రామంలో సంక్రాంతి వేడుకలు జరుపుకునే నారా, నందమూరి కుటుంబాలు
- నాలుగు రోజుల పాటు బంధువులు, గ్రామస్థులతో గడపనున్న కుటుంబ సభ్యులు
- పర్యటనలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొననున్న సీఎం చంద్రబాబు

వివరాలు 2లో..

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ..

## ఈసీకి మరోసారి మమతా బెనర్జీ లేఖ



- 2002 నాటి ఓటర్ల జాబితా డిజిటలైజేషన్ ప్రక్రియలో లోపాలు చోటు చేసుకున్నాయని ఆరోపణ
- నిజమైన ఓటర్లు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్న మమతా బెనర్జీ
- ఎస్ఐఆర్ ప్రారంభమైనప్పటి నుంచి ఈసీకి ఇది ఐదో లేఖ

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)పై పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ మరోసారి అభ్యంతరాలు వ్యక్తం చేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియ కోసం ఉపయోగిస్తున్న 2002 నాటి ఓటర్ల జాబితా డిజిటలైజేషన్ ప్రక్రియలో లోపాలు

వివరాలు 2లో..

## ఇది చంద్రబాబుకు రేవంత్ రెడ్డి ఇచ్చిన సంక్రాంతి గిఫ్ట్

- ఏపీ, తెలంగాణ మధ్య జలవివాదాలు
- తెలంగాణ పిటిషన్ ను తోసిపుచ్చిన సుప్రీంకోర్టు
- సుప్రీంకోర్టులో బలహీనమైన పిటిషన్ వేసి ఏపీకి సహకరిస్తున్నారని హరీశ్ విమర్శ
- రిట్ ఉపసంహరణ ఏపీకి ప్రాజెక్టు కట్టుకునేందుకు సమయం ఇవ్వడమేనని వ్యాఖ్య
- గురుదక్షిణ కోసమే తెలంగాణ ప్రయోజనాలను తాకట్టు పెడుతున్నారని ఆక్షేపణ
- రేవంత్ రెడ్డి తీరును ప్రజాక్షేత్రంలో ఎండగడతామని హెచ్చరిక




సంక్రాంతి పండుగ వేళ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. తన రాజకీయ గురువు, ఏపీ మాజీ సీఎం చంద్రబాబుకు ఓ విలువైన బహుమతి ఇచ్చారని, అదే సుప్రీంకోర్టులో వేసిన బలహీనమైన రిట్ పిటిషన్ అని బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ

వివరాలు 2లో..

## రెడ్‌బుక్‌ను తగలబెట్టండి

- రెడ్ బుక్ వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్న శ్యామల
- రెడ్ బుక్ పేరుతో పలువురు వైసీపీ నేతలను అరెస్ట్ చేశారని మండిపాటు
- కూటమి ప్రభుత్వానికి తగిన సమయంలో ప్రజలు బుద్ధి చెబుతారని వ్యాఖ్య



ఏపీ మంత్రి నారా లోకేశ్ రెడ్ బుక్ పై వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, యాంకర్ శ్యామల తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుత ప్రభుత్వం అమలు చేస్తున్న రెడ్‌బుక్ రాజ్యాంగం వల్ల ప్రజలు, ముఖ్యంగా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఇప్పుడు ప్రతి రైతు "అన్నమో రామచంద్ర" అంటూ లబోదిబో మంటూ ఏడుస్తున్నారని, వచ్చే రెండు సంక్రాంతుల్లో కూడా ప్రజల ముఖాల్లో చిరునవ్వు కనిపించకపోవచ్చని ఆమె వ్యాఖ్యానించారు. కానీ 2029 తర్వాత వచ్చే సంక్రాంతి నాటికి ప్రతి రైతు

వివరాలు 2లో..

## యువత దుర్భర పరిస్థితులు చూస్తుంటే బాధగా ఉంది

- జాతీయ యువజన దినోత్సవం (స్వామి వివేకానంద జయంతి)
- కూటమి ప్రభుత్వంపై విమర్శలు గుప్పించిన జగన్
- ఈ ప్రభుత్వంలో యువత భవిష్యత్తు ప్రమాదంలో పడుతోందని వ్యాఖ్య



జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి ఎక్స్ వేదికగా కీలక వ్యాఖ్యలు చేశారు. స్వామి వివేకానంద ఆలోచనలను ఆయన ప్రస్తావిస్తూ... యువత ఏకాగ్రత, లక్ష్యంతో కృషి చేస్తే దేశం బలపడుతుందని వివేకానంద నమ్మారని వివరించారు. కానీ ఆంధ్రప్రదేశ్‌లో యువత మాత్రం ఆ ఆశయానికి భిన్నంగా ఎదుర్కొంటున్న దుర్భర పరిస్థితులు చూస్తుంటే బాధగా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత 8 త్రైమాసికాలకు ఫీజు రీయింబర్స్‌మెంట్లు చెల్లించలేదని, రూ.4,900 కోట్ల విద్యా దీవెన, రూ.2,200 కోట్ల వసతి దీవెన బకాయిలు పేరుకుపోయాయని జగన్ విమర్శించారు. మేనిఫెస్టోలో వాగ్దానం చేసిన...

వివరాలు 2లో..



## గడ్కరీ వేగం అందరికీ తెలుసు...

### ఆయన నాయకత్వంలో ఈ రికార్డు గర్వకారణం

- బెంగళూరు-విజయవాడ కారిడార్‌కు 4 గిన్నిస్ రికార్డులు
- 5 రోజుల్లో 52 కి.మీ. 6 లేన్ల రహదారి నిర్మించి అరుదైన ఘనత
- కేంద్ర మంత్రి గడ్కరీ, నిర్మాణ సంస్థకు సీఎం చంద్రబాబు అభినందనలు
- అమరావతి-బెంగళూరు రోడ్డుగా పేరు పెట్టాలని ముఖ్యమంత్రి సూచన

వివరాలు 2లో..

## ఎడిటర్ వ్యూ

# అంగ రంగ వైభవంగా శ్రీశైల బ్రహ్మోత్సవాలు

ద్వాదశ జ్యోతిర్లింగాలలో ఒకటైన శ్రీశైల మల్లికార్జున స్వామి క్షేత్రంలో సంక్రాంతి ఉత్సవాలు ప్రారంభం అయినాయి. దట్టమైన నల్లమల అడవుల్లో, కృష్ణానది ఒడ్డున.. జ్యోతిర్లింగం, శక్తిపీఠం ఒకేచోట వెలసిన భూలోకకైలాసమే శ్రీశైలం. ఇక్కడ పరమేశ్వరుడు ద్వాదశ జ్యోతిర్లింగాల్లో ఒకటైన మల్లికార్జున లింగం రూపంలో కొలువైతే, పార్వతీదేవి అష్టాదశ శక్తిపీఠాల్లో ఒకటైన భ్రమరాంబికా దేవిగా దర్శనమిస్తోంది. భూలోక కైలాసంగా గుర్తింపు పొందిన శ్రీక్షేత్రంలో ఏడాదికి రెండుసార్లు బ్రహ్మోత్సవాలను... మొదటి ఉత్సవాలను సంక్రాంతి సమయంలో... రెండోసారి మాఘమాసంలో వచ్చే మహాశివరాత్రి సమయంలో నిర్వహిస్తారు. సంక్రాంతి బ్రహ్మోత్సవాలను పంచాహ్నిక దీక్షలతో 7 రోజుల పాటు జరిగే ఈ బ్రహ్మోత్సవాలు 12న ప్రాంభమై, 18 తో ముగుస్తాయి. తెలుగు నేలపై కొలువైన దివ్యక్షేత్రం శ్రీశైలం. జ్యోతిర్లింగం, శక్తి పీఠం ఒకే గిరి శృంగం మీద వెలసిన పరమ పవిత్ర స్థలంగా భాసిల్లుతున్న క్షేత్రం. పన్నెండు జ్యోతిర్లింగాలలో రెండవది, శ్రీభ్రమరాంబా దేవికి నెలవైన శక్తిపీఠం. శైవక్షేత్రాల్లో తలమానికం. మల్లికార్జున మహాలింగ చక్రవర్తి కొలువై ఉండి, సకల లోకారాధ్యంగా, త్రైలోక్య పూజితంగా విరాజిల్లు తున్నది. సంకల్ప, పూజా సందర్భాలలో శ్రీశైలానికి ఏ దిగ్భాగంలో ఉన్నామో భగవంతునికి తెలియ చేసుకునే సాంప్రదాయాన్ని బట్టి క్షేత్ర ప్రాధాన్యత స్పష్టం అవుతున్నది.పురాణాల్లో వర్ణితమైనఎనిమిది శృంగాలతో, నలభై నాలుగు నదులు, అరవై కోట్ల తీర్థరాజాలు, పరాశర, భరద్వాజాది మహర్షుల తపోవన సీమలతో, చంద్ర, సూర్య కుండాది పుష్కరిణులతో, లతలు, వృక్ష సంతతులు, అనేక లింగాలు, అద్భుత ఔషధాలు కలిగి శ్రీశైల మల్లన్న దేవుని సన్నిధికి చేర్చే దారి అత్యంత ఆహ్లాదాన్ని కలిగిస్తుంది.బ్రహ్మగిరి, విష్ణుగిరి, రుద్రగిరి అనే మూడు పర్వతాలకు పాదాభివందనం చేస్తూ వేదఘోషను ప్రతిధ్వ నింప చేస్తూ, పాతాళగంగ నామాంకిత అయిన కృష్ణవేణీ నది ఈ ప్రదేశంలో ఉత్తర వాహినిగా ప్రవహిస్తున్నది. అష్టాదశ పురాణాల్లోనూ భారత రామాయణాది ఇతిహాసా ల్లోనూ శ్రీశైల వైభవం వర్ణించ బడింది. కృతయుగంలో హిరణ్య కశిపుడు శ్రీశైలాన్ని తన పూజా మందిరంగా చేసుకొన్నాడు. పురాణాల ప్రకారం సీతారాములు ప్రతిష్ఠించిన సహస్ర లింగాలు, పాండవులు భక్తితో స్థాపించిన సద్యోజాత లింగం, పంచపాండవ లింగాలు పూజార్హత కలిగి అలరారు తున్నాయి. సంస్కృత, ఆంధ్ర, కన్నడ, మరాఠీ గ్రంథాల్లో ఈ క్షేత్రాన్ని గురించిన వర్ణనలున్నాయి. పలు భాషల కవులు క్షేత్ర ప్రాధాన్యతను అభివర్ణించారు. స్కాంద పురాణంలోని శ్రీశైల ఖండం, ఈ క్షేత్ర మహత్తును వివరిస్తోంది. ఈ క్షేత్ర ప్రశాంతతకు ముగ్ధులైన ఆది శంకరులు కొంత కాలం ఇక్కడ తపస్సు చేసి, శివానంద లహరిని రచించి, మల్లి కార్జునుడికి సమర్పించి, భ్రమరాంబ సన్నిధిలో శ్రీ చక్రాన్ని ప్రతిష్ఠించారు. దత్తావతార పరంపరలో భక్తుల పూజలందుకొనే నృసింహ సరస్వతీ స్వామి శ్రీశైల మహత్యాన్ని వివరిస్తూ తన పాదుకల్ని పట్టుకొన్న తంతుడు అనే భక్తుడికి ఈ క్షేత్ర దర్శన భాగ్యాన్ని కలిగించినట్లు గురుచరిత్ర చెబుతోంది. నృసింహ సరస్వతి స్వామి ఇప్పటికీ కదళీవనంలో గుప్తరూపంలో ఉన్నట్లు దత్తాత్రేయ భక్తులు విశ్వసిస్తారు.శ్రీశైల క్షేత్రాన్ని దర్శించి ఇక్కడి మఠాలలో ఉన్న సాధకులు, యోగుల వసతి కోసం క్రీస్తుపూర్వం నుంచి అనేక రాజవంశాలు ఎన్నో దానాలను గావించి నట్లు శిలాశాసనాలు, చారిత్రక ఆధారాలు ఉన్నాయి. ఇక్ష్వాకులు, శాతవాహనులు, విష్ణుకుండినులు, పల్లవులు, రాష్ట్ర కూటులు, చాళుక్యులు, కాకతీయులు, రెడ్డిరాజులు, విజయనగర సామ్రాజ్యాధీశులు, భ్రమరాంబికా సమేతులైన మల్లికార్జునుణ్ణి దర్శించి భక్తుల సౌకర్యాలకు ఎన్నో ఏర్పాట్లు, అశేష వస్తుసంపదలు సమర్పించారు.శ్రీశైలంలో పంచ మఠాలు ప్రాచీన మైనవి. మొదటిదైన ఘంటామఠం – శ్రీశైల ఆలయానికి వాయువ్య దిశగా ఉంది. శివ సాధకుడైన ఘంటాకర్ణ సిద్దేశ్వరుడు తన శిష్యులతో కలిసి దీనిని ఏర్పాటు చేశారు. రెండోదైన విభూతి మఠం, శ్రీకృష్ణ దేవరాయల కాలపు వీరశైవుడైన శాంతి మల్లయ్య అనే వ్యక్తి పేరు మీదుగా ఏర్పడినట్లు పరిశోధనలు వివరిస్తున్నాయి. మూడోదైన రుద్రాక్ష మఠాన్ని మల్లి శంకరస్వామి అనే భక్తుడు నిర్మించాడని తెలుస్తోంది. ఇక్కడికి వచ్చే భక్తులకు అతడు రుద్రాక్షలను పంచిపెడు తుండేవాడని స్థానికులు చెబుతుంటారు. నాలుగోదైన సారంగ మఠాన్ని సారంగేశ్వరముని నిర్మించాడని చరిత్ర చెబుతోంది. దీనికి సంబంధించిన లిఖిత ఆధారంగా క్రీ.శ.1585 నాటి శాసనం మఠంలో లభ్యమైంది. అయిదోదైన నంది మఠంలో నందికేశ్వరుడు అనే యోగి సుదీర్ఘకాలం జీవించాడు. ఇది ఘంటా మఠానికి వైపు ఉండేది. ఇవే కాకుండా శ్రీశైలంలో పలు మఠాలు ఉండేవి. వాటిలో వీరశైవ సిద్ధాంత భిక్షావృత్తి మఠం ప్రసిద్ధమైంది. క్రీ.శ. 1518లో దీనిని సిద్ధ భిక్షావృత్తి భార్య, శిష్యుడు పర్వతయ్యలు ఏర్పాటు చేసినట్టుగా తెలుస్తోంది. దీనికి చాలాకాలం ముందే 3వ కుళోత్తుంగ చోళుడు ఒక మఠాన్ని క్రీ.శ. 1178–1216 మధ్య కాలంలో ఏర్పాటు చేసినట్టుగా చరిత్ర చెబుతోంది. వటసిద్ధి మఠం, చంద్రమఠం, కమరీ మఠం అనే మఠాలు భక్తులకు అన్నవసతి ఏర్పాటు చేసినట్టుగా తెలుస్తోంది. ఇంకా అనేక మఠాలు పదహారో శతాబ్దికి పూర్వం నుంచే ఇక్కడ ఉన్నాయి. ఇంతటి ప్రాధాన్యత సంతరించుకున్నశ్రీశైల క్షేత్రంలో శ్రీశైల మహాక్షేత్రంలో మకర సంక్రమణ పుణ్యకాలాన్ని పురస్కరించుకొని శనివారం ఉదయం యాగశాల ప్రవేశంతో సంక్రాంతి బ్రహ్మోత్సవాలు ప్రారంభం అయినాయి. పంచాహ్నికదీక్షతో ఏడురోజులపాటు నిర్వహించే ఈ బ్రహ్మోత్సవాలు ఈ నెల 18న ముగియనున్నాయి. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయాన్ని, ప్రధాన వీధులను విద్యుత్ దీపాలతో ముస్తాబు చేశారు. అలాగే బ్రహ్మోత్సవాలకు భక్తులకు స్వాగతం పలుకుతూ శ్రీశైలం ముఖద్వారం నుంచి శ్రీశైలం వరకు రహదారి మార్గంలో స్వాగతతోరణాలు ఏర్పాటు చేశారు. బ్రహ్మోత్సవాలలో రెండవ రోజు నుంచి స్వామి, అమ్మవార్లకు వాహన సేవలు నిర్వహిస్తారు. భృంగివాహనసేవ, రావణ వాహనసేవ, నంది వాహనసేవ, స్వామి, అమ్మవార్లకు బ్రహ్మోత్సవ కల్యాణం, కైలాస వాహనసేవ, యాగ పూర్ణాహుతి, కలశోద్వాసన, త్రిశూల స్నానం, సదస్యం, నాగవల్లి, ధ్వజావరోణ కార్యక్రమాలు, 18వ తేదీన జరిగే పుష్పోత్సవం, శయనోత్సవం, ఏకాంతసేవలతో ఉత్సవాలు ముగియనున్నాయి. ఉత్సవాల సందర్భంగా ఈ నెల 12నుంచి 18వరకు ఆర్జిత, ప్రత్యక్ష, పరోక్షసేవలైన రుద్రహోమం, చండీహోమం, మృత్యుంజయహోమం, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణం, స్వామి, అమ్మవార్ల కల్యాణం, ఏకాంతసేవలను నిలిపి వేశారు. దేవస్థానం ఈవో శ్రీనివాస రావు ఆధ్వర్యంలో, భక్తులకు ఎలాంటి ఇబ్బంది రాకుండా అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.సంక్రాంతి ఉత్సవాలు జనవరి 12న ఉదయం స్వామివారి యాగశాల ప్రవేశంతో ప్రారంభం కానున్నాయి. 13వ తేదీ నుంచి మల్లన్న స్వామి, భ్రమరాంబ అమ్మవార్లకు వివిధ వాహన సేవలు నిర్వహిస్తారు. భక్తులకు కనువిందు చేసేలా ప్రతిరోజూ ప్రత్యేక అలంకరణలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపట్టనున్నారు. మకర సంక్రాంతి పర్వదినమైన 15వ తేదీన స్వామి, అమ్మవార్లకు బ్రహ్మోత్సవ కళ్యాణం నిర్వహిస్తారు. ఈ కళ్యాణ మహోత్సవానికి చెంచు గిరిజన భక్తులకు దేవస్థానం ప్రత్యేక ఆహ్వానం అందించింది. చెంచు సంప్రదాయాలను గౌరవిస్తూ, వారి సమక్షంలో కళ్యాణం జరగడం శ్రీశైల క్షేత్రంలో ప్రత్యేక ఘట్టంగా నిలవనుంది.బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయంలో నిర్వహించే రుద్ర హోమం, చండీ హోమం, మృత్యుంజయ హోమం, గణపతి హోమం, చండీ?రుద్ర పారాయణం వంటి యాగాలు జనవరి 12 నుంచి 18 వరకు నిరంతరంగా జరుగుతాయి. అయితే, ఉత్సవాల కారణంగా ఈ కాలంలో ఉదయాస్తమాన సేవ, ప్రాతఃకాల సేవ, ప్రదోషకాల సేవ, ఏకాంత సేవలు, స్వామి?అమ్మవారి కళ్యాణం, ఇతర ఆర్జిత సేవలను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. అలాగే, 12 నుంచి 18 వరకు రుద్ర, చండి, మృత్యుంజయ, గణపతి హోమాల కోసం ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.

# నారావారిపల్లె చేరుకున్న మంత్రి నారా లోకేశ్ కు ఆత్మీయ స్వాగతం...

రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ సంక్రాంతి సంబరాల కోసం సొంతూరికి చేరుకున్నారు. తన తండ్రి, ముఖ్యమంత్రి నారా చంద్రబాబుతో కలిసి చంద్రగిరి మండలం నారావారిపల్లెకు చేరుకున్నారు. ప్రతి ఏటా నిర్వహించే సంక్రాంతి వేడుకల్లో పాల్గొనేందుకు వారు సోమవారం ఇక్కడికి విచ్చేశారు. ఈ సందర్భంగా రంగంపేట వద్ద మంత్రి లోకేశ్‌కు ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానికులు ఘనంగా స్వాగతం పలికారు.తమను చూసేందుకు వచ్చిన ప్రతిఒక్కరినీ మంత్రి నారా లోకేశ్ ఆప్యాయంగా పలకరించారు. కార్యకర్తలు, అభిమానులతో కలిసి ఫోటోలు దిగుతూ ఉత్సాహపరిచారు. ఏటా సంక్రాంతి పండుగను నారా, నందమూరి కుటుంబ సభ్యులు నారావారిపల్లెలోనే జరుపుకోవడం ఆనవాయతీగా వస్తోంది. ఈ సంబరాల్లో పాల్గొనేందుకు ఇరు కుటుంబాల సభ్యులు గ్రామానికి చేరుకున్నారు. ఈ పర్యటనలో భాగంగా సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్, వారి కుటుంబ సభ్యులు నాలుగు రోజుల పాటు నారావారిపల్లెలోనే బస చేస్తారు. బంధువులు, గ్రామస్థులతో కలిసి పండుగను జరుపుకుంటారు. ఇదే సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పలు శంకుస్థాపనలు, అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొననున్నట్లు సమాచారం.

# ఇది చంద్రబాబుకు రేవంత్ రెడ్డి ఇచ్చిన సంక్రాంతి గిఫ్ట్

- మొదటి పేజి తరువాయి

మంత్రి హరీశ్ రావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అక్రమంగా నిర్మిస్తున్న పోలవరం – నల్లమల సాగర్ ప్రాజెక్టు విషయంలో తెలంగాణ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే ఏపీకి పూర్తిస్థాయిలో సహకరిస్తోందని, రేవంత్ రెడ్డి నిజస్వరూపం, ద్రోహబుద్ధి సుప్రీంకోర్టు సాక్షిగా బట్టబయలైందని ఆయన ఆరోపించారు.సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఏపీ ప్రభుత్వం తెలంగాణకు తీరని అన్యాయం చేసేలా ప్రాజెక్టులు కడుతుంటే, కాంగ్రెస్ సర్కారు కావాలనే విచారణకు అర్హత లేని పిటిషన్ వేసి చేతులు దులుపుకొందని విమర్శించారు. “గతంలో పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును అడ్డుకునేందుకు ఏపీ ప్రభుత్వం రైతుల చేత రిట్ పిటిషన్లు వేయించి మరీ స్టే తెచ్చుకుంది. కానీ ఇక్కడి చేతకాని కాంగ్రెస్ సర్కారు మాత్రం తెలంగాణకు తీరని ద్రోహం చేస్తోంది. ఈ మాత్రం విషయం ప్రభుత్వ న్యాయవాది, ఎంపీ అభిషేక్ మను సింఘ్వీకి తెలియదా? కేవలం రిట్ పిటిషన్‌ను ఉపసంహరించుకోవడానికే నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సూటు బూటు వేసుకుని ఢిల్లీ వెళ్లారా?“ అని హరీశ్ రావు ప్రశ్నించారు. ముఖ్యమంత్రి హోదాలో ఉంటూ రాష్ట్ర నీటి హక్కులను ఏపీకి దారాదత్తం చేయడం చారిత్రక ద్రోహమని మండిపడ్డారు.రిట్ పిటిషన్ ఉపసంహరించుకుని, సివిల్ సూట్ ఫైల్ చేస్తామని చెప్పడం ఏపీకి ప్రాజెక్టు పనులు పూర్తి చేసుకోవడానికి గడువు ఇవ్వడమేనని హరీశ్ రావు ఆరోపించారు. సివిల్ సూట్‌లో ఏపీ, తెలంగాణతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక వాదనలు కూడా వినాల్సి ఉంటుందని, ఇది ఏళ్లు గడిచినా తేలని వ్యవహారమని అన్నారు. ఈలోగా ఏపీ ప్రభుత్వం ప్రాజెక్టు పూర్తి చేసుకుని తెలంగాణ నీటి హక్కులను కాలరాస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు.పోలవరం-నల్లమల సాగర్ విషయంలో రేవంత్ ప్రభుత్వం మొదటి నుంచీ ఒక పద్ధతి ప్రకారం ఏపీకి సహకరిస్తోందని హరీశ్ ఆరోపించారు. “ఎజెండాలో లేదంటూనే బనకచర్లపై చర్చ జరిపారు. సంతకం పెట్టనంటూనే పెట్టి తెలంగాణ నదీ జలాలకు మరణశాసనం రాశారు. కమిటీ వేయనంటూనే వేసి ఏపీ జలదోపిడీకి రెడ్ కార్పెట్ వేశారు. ఇప్పుడు టెండర్ల ప్రక్రియ ముగిశాక కోర్టుకు వెళ్లి పరోక్షంగా ప్రాజెక్టుకు అంగీకారం తెలిపారు,“ అని విమర్శించారు.

కేవలం తన గురుదక్షిణ కోసమే రేవంత్ రెడ్డి తెలంగాణ ప్రయోజనాలను ఏపీకి తాకట్టు పెడుతున్నారని హరీశ్ రావు ఆక్షేపించారు. “పంచాయతీలు, న్యాయస్థానాలు వద్దని, కూర్చొని మాట్లాడుకుందాం

అనడంలో అంతర్యం ఏమిటి? తెలంగాణ నీటి హక్కులను గంపగుత్తగా ఏపీకి అప్పగించడమే ఆ చర్చల లక్ష్యమా?“ అని నిలదీశారు. “తెలంగాణలోని కృష్ణా, గోదావరి నదులపై చంద్రబాబు, ఆంధ్రా ప్రభుత్వం అడ్డుకోని ప్రాజెక్టులు ఏమైనా ఉన్నాయా? అలాంటి చంద్రబాబుతో దోస్తీ కట్టి, తెలంగాణకు తీరని అన్యాయం చేసేందుకు సిద్ధమైన రేవంత్ రెడ్డీ... నిన్ను తెలంగాణ సమాజం క్షమించదు. రేవంత్ రెడ్డీ... నీ గురుదక్షిణ కోసం తెలంగాణకు ద్రోహం చేస్తుంటే తెలంగాణను సాధించిన బీఆర్ఎస్ పార్టీ చూస్తూ ఊరుకోదు. నీ దుర్మార్గాన్ని ప్రజాక్షేత్రంలో ఎండగడతాం. తెలంగాణ నీటి హక్కుల కోసం పోరు చేస్తాం“ అని హరీశ్ రావు స్పష్టం చేశారు.

# గడ్కరీ వేగం అందరికీ తెలుసు...

- మొదటి పేజి తరువాయి

బెంగళూరు–విజయవాడ ఎకనామిక్ కారిడార్ నిర్మాణంలో నాలుగు గిన్నిస్ ప్రపంచ రికార్డులు సాధించడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. ఈ ఘనత సాధించిన ప్రతి ఒక్కరినీ ఆయన అభినందించారు. మంత్రులు, కార్యదర్శులు, జిల్లా కలెక్టర్లతో కలిసి ఈ విజయోత్సవ కార్యక్రమంలో వర్చువల్‌గా పాల్గొన్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. “కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ పనిచేసే వేగం, సామర్థ్యం దేశంలో అందరికీ తెలుసు. ఆయన నాయకత్వంలో ప్రపంచస్థాయి రికార్డు సాధించడం గర్వకారణం,“ అని కొనియాడారు. వేగంగా, అత్యంత పొడవైన 6 లేన్ల బిటుమిన్ రహదారిని నిర్మించి గిన్నిస్ రికార్డు సాధించిన రాజ్ పథ్ ఇన్ ఫ్రా కామ్ సంస్థను ప్రత్యేకంగా అభినందించారు. జనవరి 6 నుంచి 11వ తేదీ వరకు కేవలం ఐదు రోజుల్లో ఏకబిగిన 52 కిలోమీటర్ల మేర 6 లేన్ల రహదారిని నిర్మించారని, అదేవిధంగా నిరంతరాయంగా 10,655 మెట్రిక్ టన్నుల బిటుమిన్ కాంక్రీట్‌ను వేసి మరో ప్రపంచ రికార్డు నెలకొల్పారని వివరించారు. దీంతో పాటు 84.4 కిలోమీటర్ల నాలుగు లేన్ల రహదారి నిర్మాణ రికార్డును కూడా తిరగరాసినట్లు పేర్కొన్నారు. అమరావతి నుంచి బెంగళూరుకు నేరుగా నిర్మించ తలపెట్టిన రహదారికి ‘అమరావతి–బెంగళూరు రోడ్డు‘గా పేరు పెట్టాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు. బృందంగా పనిచేసి ఈ విజయాన్ని అందుకున్న అందరికీ మరోసారి అభినందనలు తెలియజేశారు.

# ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ.. ఈసీకి మరోసారి మమతా బెనర్జీ లేఖ

- మొదటి పేజి తరువాయి

చోటు చేసుకున్నాయని ఆమె ఆరోపించారు. దీనివల్ల నిజమైన ఓటర్లు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆమె అన్నారు. ఈ మేరకు ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌కు ఆమె లేఖ రాశారు. ఎస్ఐఆర్ ప్రారంభమైనప్పటి నుంచి ఆమె ఈసీకీ లేఖ రాయడం ఇది ఐదోసారి.కృత్రిమ మేధ (ఏఐ) ఆధారంగా 2002 నాటి ఓటర్ల జాబితా డిజిటలైజేషన్ చేపట్టారని, అయితే ఈ ప్రక్రియ సందర్భంగా ఓటర్ల వివరాల్లో తీవ్ర తప్పిదాలు చోటు చేసుకుంటున్నాయని ఆమె పేర్కొన్నారు. ఇది పెద్ద ఎత్తున డేటా మిస్ మ్యాచ్‌కు దారి తీసిందని, దీనివల్ల నిజమైన ఓటర్లు ఈ సమస్య బారిన పడుతున్నారని అన్నారు. ఓటర్ల జాబితా సవరణలకు సంబంధించి గత రెండు దశాబ్దాలుగా అనుసరించిన విధానాలను ఈసీ ఇప్పుడు పక్కన పెట్టిందని ఆమె ఆరోపించారు.

దీనితో ఓటర్లు తమ గుర్తింపును మళ్లీ నిరూపించుకోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈసీ ఎప్పటినుంచో వస్తున్న తన సొంత పద్ధతులను విస్మరించడాన్ని ఆమె ఖండించారు. ఇది ఏకపక్షంగా, అహేతుకంగా, రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా ఉందని అన్నారు. ఎస్ఐఆర్ సమయంలో సమర్పించిన పత్రాలకు సరైన రసీదు ఇవ్వడం లేదని విమర్శించారు. ఈ ప్రక్రియలోనే లోపం ఉందని ఆమె పేర్కొన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియ చాలా వరకు యాంత్రికంగా, సాంకేతిక డేటా ఆధారంగానే కొనసాగుతోందని, సున్నితత్వం, మానవీయతను పట్టించుకోవడం లేదని ఆమె అన్నారు.

# రెడ్‌బుక్‌ను తగలబెట్టండి

- మొదటి పేజి తరువాయి

ముఖంలో చిరునవ్వు తెచ్చే బాధ్యతను వైసీపీ అధినేత జగన్ తీసుకుంటారని అన్నారు.ఈ బోగి మంటల్లో రాష్ట్రానికి కీడుగా మారిన రెడ్‌బుక్‌ను తగలబెట్టాలని శ్యామల పిలుపునిచ్చారు. ఈ రెడ్‌బుక్ పేరుతో పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి, చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, పిన్నెల్లి రామకృష్ణ రెడ్డి, జోగి రమేశ్, కాకాణి గోవర్ధన్ రెడ్డి వంటి వైసీపీ నాయకులపై అక్రమ కేసులు పెట్టి అరెస్టులు చేశారని ఆమె ఆరోపించారు.

కోడిని కోసినా కేసు, కేక్ కట్ చేసినా కేసు అన్నట్టుగా పాలన సాగుతోందని విమర్శించారు. ప్రజాస్వామ్యానికి, రాజ్యాంగానికి విరుద్ధంగా ప్రభుత్వ వ్యవస్థలు పనిచేస్తున్నాయని ఆమె తీవ్రంగా మండిపడ్డారు. ఇలాంటి పరిస్థితులకు ప్రజలే తగిన సమయంలో గట్టి సమాధానం చెబుతారని, రాష్ట్రంలో మళ్లీ న్యాయం, సంక్షేమం రావాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

# యువత దుర్భర పరిస్థితులు చూస్తుంటే బాధగా ఉంది

- మొదటి పేజి తరువాయి

నెలకు రూ.3,000 నిరుద్యోగ భృతి కూడా రెండు సంవత్సరాలుగా చెల్లించకుండా మోసం చేస్తున్నారని మండిపడ్డారు. ఆన్‌లైన్ సర్టిఫికేషన్ కోర్సులు నిలిపివేయడం వల్ల యువత నైపుణ్యాలు పెంచుకునే అవకాశాలు కూడా దూరమవుతున్నాయని ఆయన అన్నారు.ఈ పాలనలో యువత భవిష్యత్తు ప్రమాదంలో పడుతోందని, చంద్రబాబు యువతకు వెన్నుపోటు పొడిచారని జగన్ విమర్శించారు. ఇకనైనా మేల్కొని యువతకు అవసరమైన సహకారం అందించాలని ప్రభుత్వానికి సూచించారు.

## నారావారిపల్లెకు సంక్రాంతి కళ తెచ్చిన సీఎం

- మొదటి పేజి తరువాయి

సెంట్రలైజ్డ్ అడ్వాన్స్ పరిశోధన ల్యాబ్స్, విద్యా మౌలిక వసతుల్లో భాగంగా రూ.5.03 కోట్లతో అకడమిక్ బిల్డింగ్ 2వ అంతస్తుకు, రూ.2.91 కోట్లతో చేపట్టే కాపౌండ్ వాల్ నిర్మాణాలకు శంకుస్థాపన చేస్తారు.

**నాగాలమ్మకు ప్రత్యేక పూజలు**

15వ తేదీన తమ గ్రామ దేవతైన నాగాలమ్మ గుడికి కుటుంబ సమేతంగా సీఎం చంద్రబాబు వెళతారు. అక్కడ ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అదే రోజున నారావారిపల్లె నుంచి అమరావతికి చేరుకుంటారు.

## పిఠాపురం సంక్రాంతి వేడుకలను కొనియాడుతూ పవన్ కల్యాణ్ స్పందన

- మొదటి పేజి తరువాయి

పులి వేషధారి కె. అప్పారావు, అల్లూరి సీతారామరాజు థింసా నృత్య కళాకారుడు పొద్దు అర్జున్, కోలాటం అంజలి, కోనసీమ గరగల కళాకారుడు రాజ్‌కుమార్, హరిదాసులు-గంగిరెద్దు కళాకారుడు సతీశ్... ఇలా ప్రతి కళాకారుడూ ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశారు.రెండవ రోజు ప్రార్థనా గీతాలతో శుభారంభం అయింది. విజయ శంకర్ నాయకత్వంలోని ప్రభుత్వ సంగీత-నృత్య పాఠశాల బృందం, కూచిపూడి రామాయణం వీ.ఎస్. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు భిన్నత్వంలో ఏకత్వం చాటారు. యోగా డ్యాన్స్‌తో శ్యామ్ బాబు బృందం ఆరోగ్యం-ఆధ్యాత్మికత సమన్వయాన్ని చూపించారు.

మూడవ రోజు... వినాయక తత్వంతో మంజీర కూచిపూడి బృందం, నటరాజ నృత్యం పి. సత్యనారాయణ, రేలారే రేలా జానకీరావు ఆర్కెస్ట్రా... ఇలా ప్రతి రోజూ సాంస్కృతిక వైభవం ప్రదర్శనతో సంబరాలు జోరుగా సాగాయి.పట్టణ వీధుల్లో, గొల్లప్రోలు, యూ.కొత్తపల్లి మండలాల్లో తిరిగే కళారూపాలు, స్టాళ్లలో తోలుబొమ్మలు, మగ్గాలు, ఏటికొప్పాక లక్క బొమ్మలు, బొబ్బిలి వీణల తయారీ... ఇవన్నీ ప్రత్యేక ఆకర్షణలు. వీణలను స్టాల్ వద్దే తయారు చేసిన తీరు ఆకట్టుకుంది.పండగ సంబరాల కోసం వచ్చిన సినిమా నటులు హైపర్ ఆది, ఆర్.కె. సాగర్, నవీన్ పొలిశెట్టి, దర్శకుడు హరీశ్ శంకర్, జబర్దస్త్ నటులు నెల్లూరు నాగరాజు, శ్రీనివాసులు నాయుడు, అభిరాం తదితరులకు ప్రత్యేక ధన్యవాదాలు” అని పవన్ పేర్కొన్నారు.

## తొలి తెలుగు సమురాయ్... పవన్ కల్యాణ్ 30 ఏళ్ల మార్షల్ ఆర్ట్స్ ప్రస్థానంపై స్పెషల్ వీడియో

- ‘టైగర్ ఆఫ్ మార్షల్ ఆర్ట్స్‘ గౌరవం పొందిన జనసేనాని
- పవన్ కల్యాణ్ క్రియేటివ్ వర్క్స్ సంస్థ వీడియో విడుదల
- యుద్ధ విద్యల సాధన, సినిమా ఫైట్ సీక్వెన్స్‌లతో కూడిన వీడియో
- ‘ఆంధ్రా తొలి సమురాయ్‘గా పవన్‌ను అభివర్ణించిన క్రియేటివ్ వర్క్స్



టాలీవుడ్ పవర్ స్టార్, జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ 30 ఏళ్ల మార్షల్ ఆర్ట్స్ ప్రస్థానాన్ని ఆవిష్కరిస్తూ ఒక ప్రత్యేక వీడియోను ఆయన నిర్మాణ సంస్థ ‘పవన్ కల్యాణ్ క్రియేటివ్ వర్క్స్‘ విడుదల చేసింది. యుద్ధ విద్యల పట్ల పవన్ కల్యాణ్‌కున్న నిబద్ధత, క్రమశిక్షణ, నిజాయతీ ఆయన్ను ‘ఆంధ్రప్రదేశ్ తొలి సమురాయ్‘గా నిలబెట్టాయని ఈ వీడియోకు క్యాప్షన్ జోడించారు. పవన్ కల్యాణ్ కు టైగర్ ఆఫ్ మార్షల్ ఆర్ట్స్ గౌరవం లభించిన సంగతి తెలిసిందే. జపాన్ ప్రాచీన యుద్ధ కళ (కత్తి సాము)లో ఆయనకు అధికారిక ప్రవేశం లభించింది. 30 ఏళ్ల సాధనకు ఫలితంగా ఆయనకు ఈ అపురూపమైన ఘనత లభించింది. ఈ నేపథ్యంలో పవన్ కల్యాణ్ క్రియేటివ్ వర్క్స్ సంస్థ సోషల్ మీడియాలో ఆసక్తికర వీడియోను పంచుకుంది. ఇందులో పవన్ మార్షల్ ఆర్ట్స్ ప్రస్థానాన్ని చూపించారు.

యుద్ధ విద్యల సాధన, తాను నటించిన పలు చిత్రాల్లోని ఫైట్ సీక్వెన్స్ లు, అందులో ఉపయోగించిన మార్షల్ ఆర్ట్స్ టెక్నిక్స్ ను ఈ వీడియోలో పొందుపరిచారు. పవన్ కల్యాణ్ అభిమానులను విశేషంగా అలరిస్తోంది.

## ఎమ్మెల్యేను సన్మానించిన జిల్లా స్పోక్స్ పర్సన్ బత్తిగౌడు

పలమనేరు,పెన్ పవర్, జనవరి 12,
పలమనేరు శాసన సభ్యులు అమరనాథ రెడ్డిని తెలుగుదేశంపార్టీ జిల్లా స్పోక్స్ పర్సన్ బత్తిగౌడు సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. తనపై నమ్మకంతో జిల్లా కార్యవర్గంలో చోటు కల్పించి,పార్టీ పదవిని కట్టబెట్టినందుకు ఆయనకు ధన్యవాదాలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రామచంద్ర నాయుడు, గంగవరం మండలపార్టీ అధ్యక్షులు సోమశేఖర్ గౌడ్,నాయకులు వెంకటేష్ గౌడ్,గిరిధర్ గోపాల్,చంద్ర,చలపతిగౌడ్,మునెప్పగౌడ్, వెంకటరమణ తదితరులున్నారు.



# పెన్ పవర్

రాయలసీమ

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా । తిరుపతి జిల్లా । చిత్తూరు జిల్లా । వై.ఎస్.ఆర్. కడప జిల్లా ।

## కాలనీల్లో శానిటేషన్ పనులపై కమిషనర్ తనిఖీలు





శ్రీకాళహస్తి, పెన్ పవర్, జనవరి ,12 :
కమిషనర్ పట్టణ పరిధిలోని జయ రామారావు స్ట్రీట్, తెలుగు గంగ కాలనీ మరియు కైలాసగిరి కాలనీ ప్రాంతాలలో జరుగుతున్న శానిటేషన్ పనులను ప్రత్యక్షంగా పరిశీలించి పర్యవేక్షించారు.ఈ సందర్భంగా కాలనీల్లో పారిశుధ్య పరిస్థితులను క్షుణ్ణంగా పరిశీలించిన కమిషనర్ చెత్త సేకరణ, డ్రైనేజీ శుభ్రత, దోమల నివారణ చర్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు ఆదేశించారు.సంబంధిత వార్డు శానిటరీ ఇన్స్పెక్టర్ మరియు శానిటరీ సెక్రటరీలకు శానిటేషన్ పనులు నిరంతరంగా, సమర్ధవంతంగా నిర్వహించాలని తగు సూచనలు చేశారు.ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పరిశుభ్రమైన వాతావరణం కల్పించాల్సిన బాధ్యత సిబ్బందిదేనని పేర్కొంటూ, నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కమిషనర్ హెచ్చరించారు.

## ఆర్టీఐ కార్యకర్త అసోసియేషన్ ఏపీ ఉపాధ్యక్షులుగా

# పల్లీ కోటేశ్వర రావు నియామకం

గూడూరు, పెన్ పవర్,జనవరి,12:
ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి సమాచార హక్కు కార్యకర్త అసోసియేషన్ (ఆర్టీఐ) ప్రదేశ్ ఉపాధ్యక్షులుగా పల్లీ కోటేశ్వర రావు ని నియమించినట్లు సంఘం జాతీయ కార్యవర్గం ప్రకటించింది. ఈ నియామకానికి సంబంధించి అధికారిక ప్రకటనను విడుదల చేసింది.సమాచార హక్కు చట్టాన్ని ప్రజల వరకు విస్తృతంగా తీసుకెళ్లడం, అవినీతి నిర్మూలన కోసం పోరాటం చేయడం, సామాన్య ప్రజలకు న్యాయం అందేలా కృషి చేయడం అనే లక్ష్యాలతో పల్లీ కోటేశ్వర రావు తన బాధ్యతలను సమర్ధవంతంగా నిర్వర్తిస్తారని సంఘం విశ్వాసం వ్యక్తం చేసింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఆర్టీఐ ఉద్యమాన్ని మరింత బలోపేతం చేస్తూ ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలు చేపడతారని ఆశాభావం వ్యక్తం చేసింది.
ఈ సందర్భంగా పల్లీ కోటేశ్వర రావు మాట్లాడుతూ, ఈ బాధ్యతను తనకు అప్పగించడంలో పూర్తి సహకారం అందించిన నాలి మధుసూదన్ యాదవ్ కి, ఆర్టీఐ కార్యకర్త అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఇన్చార్జి మద్దిశెట్టి సామెల్ కు,అలాగే సంఘం జాతీయ అధ్యక్షులు డాక్టర్ శుక్ల కు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.సమాజానికి సేవ చేయడమే లక్ష్యంగా ఆర్టీఐ చట్టాన్ని సమర్థవంతంగా వినియోగిస్తూ ప్రజల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు



## భారతీయ జనతా యువమోర్చా గూడూరు ఆధ్వర్యంలో

## ఘనంగా స్వామి వివేకానంద జయంతి





గూడూరు, పెన్ పవర్,జనవరి,12:
భారతీయ జనతా యువ మోర్చా (బీజేవైఎం) గూడూరు ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి గిద్దలూరు మనోజ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా గూడూరు పట్టణంలోని స్థానిక కార్ స్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన స్వామి వివేకానంద గారి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం గిద్దలూరు మనోజ్ కుమార్ మాట్లాడుతూ, భారతదేశ గొప్పతనాన్ని ప్రపంచ నలుమూలల చాటి చెప్పిన మహనీయుడు స్వామి వివేకానంద అని అన్నారు. ఆయన ఆలోచనలు, ఆదర్శాలు యువతకు దిశానిర్దేశం చేసే మార్గదర్శకమని పేర్కొన్నారు.స్వామి వివేకానందను ఆదర్శంగా తీసుకుని విద్యార్థులు, యువత క్రమశిక్షణతో, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు. యువతలో దేశభక్తి, సేవాభావం పెంపొందించడంలో స్వామి వివేకానంద బోధనలు ఎంతో ప్రేరణనిస్తాయని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో బీజేవైఎం నగర అధ్యక్షుడు శివశంకర్‌తో పాటు బీజేవైఎం నాయకులు చిన్న వసంత్, మహేష్, ప్రణయ్, కిరణ్, నవీన్, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు

# స్వామి వివేకానంద యువతకు స్ఫూర్తి ప్రదాత





బుచ్చిరెడ్డిపాలెం జనవరి 12.
స్వామి వివేకానంద జయంతి సందర్భంగా డ్రగ్స్ కు వ్యతిరేకంగా బుచ్చిరెడ్డి పాళెంలో 3కె రన్.సే నో టు గాంజ నినాదంతో తలపెట్టిన 3కె రన్ దారి తప్పిన యువతకు సందేశం.
యువత సన్మార్గంలో నడవాలి, స్నేహితుల్లో ఎవరైనా దారి తప్పి వుంటే వారిని సంస్కరించాల్సిన బాధ్యత కూడా యువతపై ఉంది. నెల్లూరు జిల్లా పోలీసు అసాంఘిక శక్తుల పాలిట సింహ స్వప్నంగా పనిచేస్తుంది. కష్టపడి చదవండి, తల్లితండ్రుల ఆశలు వమ్ము చేయకండి. 3 కె ప్రారంభోత్సవం సందర్భంగా ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి.
యువత సన్మార్గంలో నడవాలని స్నేహితుల్లో ఎవరైనా దారి తప్పి వుంటే వారిని సంస్కరించాల్సిన బాధ్యత కూడా యువతపై ఉందన్నారు కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి స్వామి వివేకానంద జయంతి సందర్భంగా డ్రగ్స్ కు వ్యతిరేకంగా బుచ్చిరెడ్డి పాళెం డి ఎల్ ఎన్ ఆర్ హైసూల్ వద్ద నుంచి ప్రారంభమైన 3 కె రన్ ను ఆమె పచ్చా జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ "సే నో టు గాంజ " నినాదంతో తలపెట్టిన 3 కె రన్ దారి తప్పిన యువతకు సందేశం లాంటిదన్నారు. యువశక్తిని సరైన దిశలో మళ్ళించడానికి బుచ్చిరెడ్డి పాళెం యువత చేసిన కృషిని ఆమె అభినందించారు. చదువొక్కటే కాకుండా క్రీడలు, 3 కె రన్ సందేశాత్మక కార్యక్రమాలు చేయాలని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి గారు సూచించారు. కష్టపడి చదివి కన్న వాళ్ళ ఆశలు, ఆకాంక్షలు నెరవేర్చాలని ఆమె యువతకు హితవు పలికారు. మత్తు పదార్ధాల సేవనానికి వ్యతిరేకంగా యువత తలపెట్టిన అవగాహన కార్యక్రమం ఒక్క రోజుతో ముగిసి పోకూడదని కొనియాడారు. నేరాల నియంత్రణలో యువత కూడా భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి పేర్కొన్నారు చెడు స్నేహాలకు దూరంగా ఉండాలని ఆమె యువతకు పిలుపునిచ్చారు చెడుసావాసాల బారిన పడ్డ దారి తప్పుతున్న యువతను సంస్కరించే బాధ్యత యువతపైనే ఉందని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి యువతకు దిశ నుంచి అర్థం చేశారు ఈ కార్యక్రమంలో మిర్చి మున్సిపల్ చైర్ పర్సన్ మోర్ల సుప్రజా ఓ వేరు కోపరేటివ్ బ్యాంక్ చైర్ పర్సన్ టోటల్ విజయలక్ష్మి టిడిపి సీనియర్ నాయకులు కొందూరు కమలాకర్ రెడ్డి దువ్వూరు కళ్యాణ్ రెడ్డి బెజవాడ వంశీకృష్ణారెడ్డి మండల రూరల్ టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు టిడిపి అధ్యక్షులు బెజవాడ జగదీష్ గుప్తా శ్రీనివాసరావు జొన్నవాడ ఆలయ మాజీ చైర్మన్ పుట్ట సుబ్రహ్మణ్యం నాయుడు చేనేత సంఘం నాయకులు కే వి శేషయ్య బుచ్చి వైస్ చైర్మన్ కౌన్సిలర్లు కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు

## ప్రగతి సేవా సంస్థ వేదికగా సంక్రాంతి సంబరాలు

## ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ చేతుల మీదుగా బహుమతులు




గూడూరు, పెన్ పవర్,జనవరి,12:
ప్రగతి సేవా సంస్థ వార్షికోత్సవ కార్యక్రమంలో భాగంగా చైతన్య స్కూల్‌లో నిర్వహించిన సంక్రాంతి సంబరాలు ఉత్సాహంగా జరిగాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన రంగుల వల్లి పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గూడూరు శాసన సభ్యులు పాశిం సునీల్ కుమార్ విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు ఇటువంటి సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. విద్యతో పాటు సంస్కృతి, సంప్రదాయాలను పిల్లలకు పరిచయం చేయడం అవసరమని అన్నారు.ఈ కార్యక్రమంలో ప్రగతి సేవా సంస్థ అధ్యక్షులు కడివేటి చంద్రశేఖర్, సంస్థ ప్రతినిధులు, పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు మరియు తల్లిదండ్రులు పాల్గొన్నారు.



# మన్నేటికోటలో వైభవంగా విపిఆర్ అమృత ధార వాటర్ ప్లాంట్ ప్రారంభోత్సవం

**- ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఎంఎల్ఏ ఇంటూరి నాగేశ్వరరావు**

**- ప్రజాసేవే విపిఆర్ ఫౌండేషన్ లక్ష్యం - ఉలవపాడు మండలంలో రెండో వాటర్ ప్లాంట్ ప్రారంభం**





పెన్ పవర్ నెల్లూరు బ్యూరో జనవరి 12
పేదల దాహార్తి తీర్చే లక్ష్యంగా నెల్లూరు పార్లమెంట్ సభ్యుడు ప్రభాకర్ రెడ్డి విపిఆర్ అమృత ధార వాటర్ ప్లాంట్ లు గ్రామీణ ప్రజల గొంతు తడుపుతున్నాయి. సోమవారం ఉలవపాడు మండలం, మన్నేటికోటలో ఏర్పాటుచేసిన విపిఆర్ అమృత ధార వాటర్ ప్లాంట్ ప్రారంభోత్సవానికి నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తదితరులు హాజరయ్యారు. ముందుగా గ్రామానికి చేరుకున్న ఎంపీ, ఎమ్మెల్యేకు మన్నెటి కోట నాయకులు కార్యకర్తలు అపూర్వ స్వాగతం పలికారు. అనంతరం గ్రామంలో ఏర్పాటుచేసిన విపిఆర్ అమృతధార వాటర్ ప్లాంట్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ 2017లో విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వాటర్ ప్లాంట్ లు ఇప్పటికీ అద్భుతంగా పనిచేస్తున్నాయన్నారు. అలాగే ఇటీవల విపిఆర్ నేత్ర ద్వారా ప్రజలకు కంటి పరీక్షలు ఉచితంగా చేయిస్తూ కంటి అద్దాలు అందజేస్తున్నామన్నారు. కందుకూరు నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు కూడా సేవలు అందిస్తామన్నారు. ఉలవపాడు మండలంలో ఇది రెండవ ప్లాంటని చెప్పారు. దివ్యాంగులకు ట్రై సైకిల్స్ అందించి వారిలో ఆత్మవిశ్వాసం నింపామని చెప్పారు. ఈ సందర్భంగా గ్రామంలో ఉన్న వృద్ధులను ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ఆప్యాయంగా పలకరించారు. ప్రభుత్వం నుంచి అందుతున్న లబ్ది నీ తెలుసుకున్నారు. 1వ తేదీనే పింఛను అందిస్తూ ఆదుకుంటుందని చెప్పారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన సిమెంట్ రోడ్లు ప్రారంభించారు.గ్రామంలో ఎప్పటినుంచో నీటి వసతి సరిగా లేక ఇబ్బందులు పడుతున్నామని, నేడు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి సహకారంతో విపిఆర్ అమృత ధార ప్లాంట్ ఏర్పాటు అయిందనీ గ్రామస్తులు అన్నారు. ఈ సందర్భంగా వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు శివ, మన్నేటికోట సర్పంచ్ బసవయ్య, టిడిపి నాయకులు కేతంరెడ్డి వినోద్ రెడ్డి, గుడి హరి రెడ్డి, ఇతర నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# నేడు ఆత్మకూరు నియోజకవర్గంలో మంత్రి ఆనం, ఎంపీ వేమిరెడ్డి పర్యటన

ఆత్మకూరు పెన్ పవర్ జనవరి 12.

ఆరు విపిఆర్ అమృతధార మినరల్ వాటర్‌ప్లాంట్లు, సిమెంటురోడ్లకు ప్రారంభోత్సవాలు




నెల్లూరు, జనవరి 12 : గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు, మెరుగైన మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా ఆత్మకూరు నియోజకవర్గంలో మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి విస్తృతంగా అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు.మంగళవారం ఉదయం నియోజకవర్గంలోని అనంతసాగరం, మర్రిపాడు, ఏఎస్‌పేట, సంగం, చేజర్ల మండలాల్లో అభివృద్ధి పనులకు మంత్రి, ఎంపీ ప్రారంభోత్సవాలు చేయనున్నారు. నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలోని విపిఆర్ ఫౌండేషన్ ద్వారా ఏర్పాటుచేసిన 6 అమృతధార వాటర్‌ప్లాంట్లను, 69లక్షల ఉపాధిహామీ నిధులతో నిర్మించిన సిమెంటురోడ్ల ప్రారంభోత్సవం, ఏఎస్ పేట మండలం మదరాబాదులో 22.80లక్షలతో జల్‌జీవన్ మిషన్ రక్షిత మంచినీటి పథకం ప్రారంభోత్సవాల్లో మంత్రి, ఎంపీ పాల్గొంటారు.అనంతసాగరం మండలం ఎగువపల్లి, మర్రిపాడు మండలం రాజుపాలెం, ఏఎస్‌పేట మండలం మదరాబాదు, కావలియడవల్లి, సంగం మండల కేంద్రంలో, చేజర్ల మండలం ఎన్‌వి కండ్రిగలో విపిఆర్ అమృతధార వాటర్‌ప్లాంట్లు, సిమెంటురోడ్లను మంత్రి, ఎంపీ ప్రారంభిస్తారు.



# ప్రజలకు ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పించాలి

పలమనేరు,పెన్ పవర్, జనవరి 12,

ప్రజల ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పించాలని పలమనేరు ఆరోగ్య సబ్ యూనిట్ అధికారి జయశంకర్ సూచించారు.సోమవారం ఆయన ఆధ్వర్యంలో పలమనేరు సబ్ యూనిట్ లోని హెల్త్ అసిస్టెంట్లకు నెలవారి రివ్యూ మీటింగ్ నిర్వహించారు.ఈ సమావేశంలో నెలవారి రికార్డులను తనిఖీ చేసి, ఇంకా ఏరికార్డ్స్ మెయింటైన్ చేయాలో తెలిపారు.ఫీల్డ్ లెవల్లో అందరూ యాక్టివ్ సర్వేలెన్సు ప్రతిరోజు చేయవలసినదిగా ఆదేశించారు.వెక్టార్ బార్న్ డిసీజెస్ మరియు వాటర్ బార్న్ డిసీజెస్ మరియు ఫుడ్ బార్న్ డిసీజెస్ గురించి ప్రజలకు విస్తృతముగా అవగాహన కల్పించాలని వివరించారు.గ్రామాలలో మరియు వార్డులలో సందర్శించినప్పుడు పైప్ లైన్ లీకేజెస్ మొదలైనవి ఐడెంటిఫై చేసి పంచాయతీ మరియు వార్డ్ సెక్రటరీలకు తెలియజేసి లీకేజెస్ అరికట్టేందుకు తోడ్పడాలన్నారు.ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెన్స్ మహబూబ్ బాషా,రవి,బలరాం, యరపరెడ్డి,రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు



# హెల్పింగ్ హ్యాండ్స్ సేవా కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి






శ్రీకాళహస్తి ,పెన్ పవర్, జనవరి, 12 :

శ్రీకాళహస్తి పట్టణంలోని జయరాం రావు వీధి, నెక్స్ట్ షోరూం సమీపంలో హెల్పింగ్ హ్యాండ్స్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన సేవా కార్యక్రమంలో శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో తుడా చైర్మన్ సోదరులు డాలర్స్ దివాకర్ రెడ్డి కూడా ఎమ్మెల్యేతో కలిసి పాల్గొన్నారు. నిస్సహాయ స్థితిలో ఉన్న దివ్యాంగులకు నిత్యావసర సరుకులు, బియ్యం మరియు చలికాలాన్ని దృష్టిలో ఉంచుకొని దుప్పట్లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, సమాజంలో ఉన్నత భావంతో పేదల కోసం పనిచేస్తున్న స్వచ్ఛంద సేవా సంస్థల కృషి అభినందనీయమని పేర్కొన్నారు. ఆపదలో ఉన్న వారికి చేయూతనివ్వడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో దివాకర్ రెడ్డి, కూటమి నాయకులు, కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# కాకాణి పూజితమ్మ చేతుల మీదుగా దుస్తుల పంపిణీ





పొదులుగురు పెన్ పవర్ జనవరి 12.

సంక్రాంతి పండుగ సందర్భంగా ఆనవాయితీ ప్రకారం ప్రతిఏటా తమ స్వస్థలం తోడేరు గ్రామంలో ప్రజలందరికీ నూతన వస్త్రాలు అందించడంలో భాగంగా రత్నగిరి, శాంతినగర్, తోడేరు ఎస్సీ కాలనీ, వీవర్స్ కాలనీ లోని కుటుంబాలకు చీరలు, పంచలు, లుంగీలు పంపిణీ దుస్తుల పంపిణీకి విచ్చేసిన పూజితమ్మకు ఆదరాభిమానాలతో ఘన స్వాగతం పలికిన తోడేరు గ్రామస్తులు తోడేరు గ్రామ ప్రజల సహకారం ఎప్పటికీ మర్చిపోలేమని ఊహ తెలిసినప్పటినుండి కుటుంబ సభ్యుల లాంటి గ్రామస్తుల మధ్య సంక్రాంతి పండుగ జరుపుకుంటామని తాత కాకాణి రమణారెడ్డి తండ్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి గార్ల స్ఫూర్తితో గ్రామస్తులకు సంపూర్ణ సహాయ సహకారాలు అందిస్తామని తెలియజేస్తూ గ్రామస్తులందరికీ పేరుపేరునా సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేసిన కాకాణి పూజితమ్మ

# సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీలో బొజ్జల రిషితమ్మ బాధిత కుటుంబాలకు భరోసా

శ్రీకాళహస్తి రూరల్, పెన్ పవర్ , జనవరి ,12 :

శ్రీకాళహస్తి నియోజకవర్గం తొట్టంబేడు మండలం పరిధిలో సీఎం రిలీఫ్ ఫండ్ కింద బాధిత కుటుంబాలకు చెక్కుల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి పర్యవేక్షణలో బొజ్జల రిషితమ్మ పలువురు లబ్ధిదారులకు ఆర్థిక సహాయం అందజేశారు.పూడి గ్రామానికి చెందిన చెరుకు మణి నాయుడు కుమారుడు చెరుకు పవన్ నాయుడుకు రూ.1,38,000, దిగువ కొనతనేరి గ్రామానికి చెందిన సంద్ర ప్రసాద్ నాయుడు సతీమణి సంద్ర పావనికి రూ.81,000, చియ్యవరం గ్రామానికి చెందిన లక్ష్మమ్మకు రూ.55,000, ఇలగనూరు గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ చెరుకూరి మధు నాయుడుకు రూ.55,000ల చెక్కులను బొజ్జల రిషితమ్మ అందజేశారు.ఆరోగ్య సమస్యలు, ప్రమాదాలు, పాముకాటు, విద్యుత్ షాక్ వంటి దుర్ఘటనలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా సహాయం అందించడం సంతోషకరమని గ్రామ ప్రజలు పేర్కొన్నారు. కొనతనేరి గ్రామంలో బొజ్జల రిషితమ్మను శాలువాతో సన్మానించి చెక్కులు స్వీకరించడం విశేషం.ఈ సందర్భంగా గ్రామస్తులు పలు అభివృద్ధి సమస్యలను ఆమె దృష్టికి తీసుకువచ్చారు. స్కూల్ భవనం నుంచి హరిజనవాడ వరకు రోడ్డు నిర్మాణం, హరిజనవాడలో వాటర్ ప్లాంట్ ఏర్పాటు, హరిజనవాడ నుంచి స్మశానం వరకు రోడ్డు సౌకర్యం కల్పించాలని కోరారు. దీనికి స్పందించిన బొజ్జల రిషితమ్మ త్వరలో అన్ని అభివృద్ధి పనులు పూర్తి చేయిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో గాలి



సుధాకర్ నాయుడు, పాళెపు మురళి నాయుడు, రాజేంద్ర నాయుడు, రాడవరం చంద్రశేఖర్ నాయుడు తదితర నాయకులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

# 19వ వార్డు వవ్వేరు గ్రామంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

బుచ్చిరెడ్డిపాలెం పెన్ పవర్ జనవరి 12.

వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి ఆదేశాల మేరకు బుచ్చిరెడ్డిపాలెం మున్సిపాలిటీలోని 19వ వార్డు వవ్వేరు గ్రామంలో నిర్వహించినటువంటి “ప్రశాంతమ్మ ప్రజా పాలన ప్రజా సమస్యల పరిష్కార వేదిక “కార్యక్రమంలో పాల్గొన్న బుచ్చిరెడ్డిపాలెం మున్సిపల్ చైర్ పర్సన్ మోర్ల సుప్రజ మురళి ఈ కార్యక్రమంలో చైర్పర్సన్ మాట్లాడుతూ మన ఎమ్మెల్యే ఆదేశాల మేరకు ఈ ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించామని, ఈ కార్యక్రమంలో ప్రజల యొక్క సమస్యలు తెలుసుకోవడానికి ప్రతి వార్డుకు వెళ్లాలని ఎమ్మెల్యే సూచించారని, తెలియజేశారు... ఈ కార్యక్రమంలో ప్రజల నుంచి రోడ్లు, డ్రైనేజీ, ఇళ్ల స్థలాలు,పింఛన్ల మంజూరు, స్మశాన వాటిక,అర్జీలను స్వీకరించడం జరిగిందని,ఆ అర్జీలకు సంబంధించిన విషయాలను ఆయా సంబంధిత అధికారులతో మాట్లాడి ఆ సమస్యలన్నీ కూడా ఎమ్మెల్యే గారి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని,చైర్పర్సన్ తెలియజేశారు.ప్రతి వార్డులో కూడా ఈ కార్యక్రమం జరుగుతుందని,కాబట్టి ప్రతి వార్డులోని ప్రజలందరూ కూడా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని చైర్ పర్సన్ తెలియజేశారు. ప్రతి వార్డులోని కౌన్సిలర్లు,నాయకులు, అందరూ కూడా ప్రజలకు అందుబాటులో ఉండి, ప్రజల యొక్క సమస్యలను, పరిష్కరించాలని చైర్పర్సన్ తెలియజేశారు బుచ్చిరెడ్డిపాలెం మున్సిపాలిటీ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో చైర్ పర్సన్ తో పాటు వైస్ చైర్మన్ ఎరుటపల్లి వెంకట శివ కుమార్ రెడ్డి, 19వ వార్డు కౌన్సిలర్ కోటంరెడ్డి లలితమ్మ, 10 వార్డు కౌన్సిలర్ బెలూమ్ మల్లారెడ్డి, 11వ వార్డు కౌన్సిలర్ రాచూరి సత్యం 17వ వార్డు కౌన్సిలర్ తాళ్ల వైష్ణవి టౌన్ అధ్యక్షులు గుత్తా శ్రీనివాసులు జిల్లా ఉపాధ్యక్షులు ఎం వి శేషయ్య క్లస్టర్ ఇంచార్జ్ సుధాకర్ రెడ్డి తెలుగుదేశం పార్టీ నాయకుడు కాటంరెడ్డి శ్రీకాంత్ రెడ్డి 19వ వార్డు ఇంచార్జ్ శివకుమార్ టిడిపి బిజెపి జనసేన నాయకులు మున్సిపల్ ఆఫీస్ సిబ్బంది సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు



# వివేకానందుడి జీవితం యువతకు స్ఫూర్తిదాయకం

## -ఘనంగా స్వామి వివేకానంద జయంతి వేడుకలు




జలదంకి పెన్ పవర్, జనవరి 12

స్వామి వివేకానందుడు జీవితం యువతకు స్ఫూర్తిదాయకమని భారతీయ జనతా పార్టీ జిల్లా కార్యదర్శి మారెళ్ళ బ్రహ్మారెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి ఒంటేరు రాకేష్ రెడ్డి, బిజెపి మండల అధ్యక్షుడు ముడి కిషోర్ రెడ్డి, జలదంకి ఎంపీటీసీ కుట్టు బోయిన మాధవరావులు పేర్కొన్నారు. సోమవారం స్వామి వివేకానంద జయంతి ఉత్సవాలను మండలంలోని చింతలపాలెం గొట్టిపాటి కాకర్ల ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్లో భాగంగా ఘనంగా నిర్వహించారు. ఈ జయంతి వేడుకలను నిర్వాహకులు అయినటువంటి ఒంటేరు రాకేష్ రెడ్డి, ఉప్పుటూరు సుధీర్ బాబు, అక్కల మహేష్ రెడ్డి, గొట్టిపాటి నవీన్ ల ఆధ్వర్యంలో జరిగాయి. ఈ జయంతి వేడుకలకు జలదంకి మండల తెలుగుదేశం పార్టీ కన్వీనర్ మునగాల తిరుమలరెడ్డి హాజరై, బిజెపి నాయకులతో కలిసి స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా స్వామి వివేకానంద సూక్తులను సందేశాలను నాయకులు వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వామి వివేకానంద రామకృష్ణ పరమహంస శిష్యుడిగా పేరు తెచ్చుకొని గురు శిష్యుల బంధానికి ప్రతీకగా రామకృష్ణ మఠాన్ని స్థాపించి యువతకు ఆదర్శంగా నిలిచాడని అన్నారు. జనవరి 12న వివేకానందును జయంతిని జాతీయ యువజన దినోత్సవం గా జరుపుకుంటున్నామని అన్నారు. వివేకానందుని సూక్తులు యువతులు ఆత్మవిశ్వాసం క్రమశిక్షణ దేశభక్తిని పెంపొందించే విధంగా ఉంటాయన్నారు. సందేశాలు ప్రపంచవ్యాప్తంగా కోట్లాదిమంది యువతకు మార్గదర్శకంగా నిలుస్తాయని వివరించారు. ఆయన మాటలు మానవతా విలువలు, ఆధ్యాత్మికతను చూపిస్తాయన్నారు. లేవండి మేల్కొండి లక్ష్యం చేరేవరకు ఆగకండి ఇలాంటి సూక్తులు ధైర్యంతో జీవిత పోరాటం చేయమని చెబుతాయని అన్నారు. పేదరికం, అసత్యాలపై ప్రేమతో గెలవాలని, అంతర్గత శక్తిని గుర్తించి మానవత్వాన్ని చాటాలని ఆయన స్ఫూర్తిదాయక సందేశాలు ఉంటాయని, వివేకానంద బాటలో యువత నడవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టిడిపి కామా బిజెపి నాయకులు పాల్గొన్నారు.

# పెళ్లకూరు ఎస్ ఐ హెచ్చరికలు జూదాలు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు...




పెళ్లకూరు, పెన్ పవర్, జనవరి 12
సంక్రాంతి పండుగను మండల ప్రజలు సంతోషంగా జరుపుకోవాలని ఆకాంక్షిస్తూ జిల్లా ఎస్పీ మరియు రూరల్ సి ఐ వారి ఆదేశాల మేరకు పోలీసు వారి తరఫున ప్రజలకు కొన్ని సూచనలు,హెచ్చరికలు తెలియజేస్తున్నాం. మండల పరిధిలో ఎవరైనా కోడిపందాలు, డైమండ్ డప్పా, పేకాట ఇతర జూదాలతో పాటు చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే వారిపై కేసులు నమోదు చేసి చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటాం. పండగ రోజున ప్రజలు సుఖ సంతోషాలతో పండగ జరుపుకోవాలని మీ పిల్లలు మీ బాధ్యత అనే విధంగా తల్లిదండ్రులు యువకులను ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడకుండా చూసుకోవాలని పెళ్లకూరు మండల సబ్ ఇన్స్పెక్టర్ దారం. ఆదిలక్ష్మి తెలియజేశారు. ఇటువంటి ఆ సాంఘిక కార్యకలాపాలు నివారించేందుకు ముందస్తుగా పోలీస్ వారికి సమాచారం ఇవ్వాలని సూచిస్తున్నాం. పోలీసువారి సూచనలు పాటిస్తూ పండుగను మండల ప్రజలు సంతోషంగా జరుపుకోవాలని కోరుకుంటూ మరోసారి ప్రజలకు భోగి, సంక్రాంతి, కనుమ పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తున్నాం.

# నియోజకవర్గ ప్రజలందరూ సంక్రాంతి పండుగను సంతోషంగా జరుపుకోవాలి... -ఆత్మకూరు జనసేన పార్టీ





ఆత్మకూరు పెన్ పవర్ జనవరి 12.
నేత చదలవాడ హరీష్ కుమార్, మృదుల దంపతులు శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ఆత్మకూరు నియోజకవర్గం జనసేన పార్టీ నేత చదలవాడ హరీష్ కుమార్ ఆధ్వర్యంలో నియోజకవర్గ కేంద్రంలోని టిట్కో గృహాల వద్ద ఈరోజు ముందస్తు సంక్రాంతి వేడుకలు నిర్వహించారు.. చదలవాడ హరీష్ కుమార్ మరియు వారి సతీమణి మృదుల దంపతుల ఆధ్వర్యంలో నిర్వహించిన సంక్రాంతి వేడుకలలో కాలనీలోని మహిళలు యువకులు అందరూ ఎంతో సంతోషంగా పాల్గొన్నారు. మొదట ఈ ప్రాంతంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు ముగ్గుల పోటీలలో గెలుపొందిన మహిళలకు బహుమతులు అందించారు.. అనంతరం హరిదాసు వేషధారణలతో స్థానిక మహిళలతో కలిసి కోలాటం ఆడుతూ సంబరాల నిర్వహించారు.. అక్కడే భోగి మంటలు వేసి వాటి చుట్టూ తిరుగుతూ అందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు... ఈ కార్యక్రమంలో జనసేన నేత చదలవాడ హరీష్ కుమార్, వీర మహిళ మృదుల తో పాటు నియోజకవర్గంలోని జనసేన నాయకులు గడ్డం.వంశీ కృష, దాడి భాను కిరణ్, సయ్యద్ అక్బర్ భాష, పత్తిపాటి.ప్రవీణ్, వనం.పవన్ కుమార్, పసుపులేటి.శ్రీరామ్, ముత్యాల. కోటయ్య, యు.శ్రీనివాసులు, పునువర్తి.మణి జనసేన జిల్లా నాయకులు మరియు స్థానిక నేతలు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.. ఈ సందర్భంగా హరీష్ కుమార్, మృదుల మాట్లాడుతూ సంక్రాంతి పండుగను ముందస్తుగా నియోజకవర్గం లోని ప్రజలతో జరుపుకోవడం తనకు ఎంతో సంతోషంగా ఉందని ప్రధాన పండుగ అయిన సంక్రాంతి పండుగను ప్రతి ఒక్కరూ ఎంతో ఆనందంగా జరుపుకోవాలని ఈ సందర్భంగా తమ అధినేత పవన్ కళ్యాణ్ గారికి నియోజకవర్గంలోని జనసేన పార్టీ నేతలు ,ప్రజలందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు తెలుపుతున్నామని అన్నారు..





## భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో

# వివేకానంద జయంతి

శ్రీకాళహస్తి ,పెన్ పవర్ ,జనవరి, 12 :
శ్రీకాళహస్తి పట్టణంలో స్వామి వివేకానంద జయంతిని భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక వాతావరణంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమం ప్రారంభంలో స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.
ఈ సందర్భంగా స్కౌట్స్ మాస్టర్ ఎస్.కే. అజారుద్దీన్ మాట్లాడుతూ, స్వామి వివేకానంద బోధనలు నేటి యువతకు మార్గదర్శకమని పేర్కొన్నారు. క్రమశిక్షణ, సేవాభావం, దేశభక్తి వంటి విలువలను యువత తమ జీవితంలో అమలు చేయాలని సూచించారు. ప్రతి ఒక్కరూ సామాజిక సేవలలో ముందుండి పనిచేస్తే సమాజ అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు.
ఈ కార్యక్రమంలో స్కౌట్స్ మాస్టర్ సుబ్రహ్మణ్యం, వెంకటేష్, ధనుష్తో పాటు ఏపీజే అబ్దుల్ కలాం స్కౌట్ ట్రూప్ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. కార్యక్రమం చివర్లో స్వామి వివేకానంద ఆశయాలను అనుసరించాలనే సంకల్పంతో కార్యక్రమం ముగిసింది.

# లక్షలు కేంద్రం ప్రభుత్వం నిధులతో ఆయుష్మాన్ భవ భవనానికి భూమి పూజ



బుచ్చిరెడ్డిపాలెం పెన్ పవర్ జనవరి 12.
బుచ్చిరెడ్డిపాలెం పట్టణ ప్రజల ఆరోగ్య సంరక్షణలో మరోకీలక ఘట్టం అవిష్కృతమైంది స్థానిక ప్రభుత్వ వైద్యశాల ప్రాంగణంలో నూతనంగా ఏర్పాటు చెయ్యనున్న ఆయుర్వేద క్లినిక్ నిర్మాణానికి మున్సిపల్ చైర్ పర్సన్ మోర్ల సుప్రజా మురళి అత్యంత వైభవంగా భూమి పూజ నిర్వహించారు ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ పురాతన మరియు శక్తివంతమైన ఆయుర్వేద చికిత్సలు సామాజిక ప్రజలకు ఉచితంగా అందించటమే లక్ష్యంగా ఈ క్లినిక్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు టిడిపి జిల్లా అధ్యక్షులు ఎం వి శేషయ్య మండల అధ్యక్షుడు గుత్తా శ్రీనివాసులు బిజెపి జనసేన నాయకులు ప్రభుత్వ వైద్య సిబ్బంది పాల్గొన్నారు

# జిల్లా ఎస్పీ హెచ్చరికలు జూదాలు పాల్పడితే కఠిన చర్యలు




బుచ్చిరెడ్డిపాలెం జనవరి 12.
సంక్రాంతి పండుగను మండల ప్రజలు సంతోషంగా జరుపుకోవాలని ఆకాంక్షిస్తూడజిల్లా ఎస్పీ మేడం మరియు రూరల్ డిఎస్పీ వారి ఆదేశాల మేరకు పోలీసు వారి తరఫున ప్రజలకు కొన్ని సూచనలు,హెచ్చరికలు తెలియజేస్తున్నాం. మండల పరిధిలో ఎవరైనా కోడిపందాలు, డైమండ్ డప్పా, పేకాట ఇతర జూదాలతో పాటు చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే వారిపై కేసులు నమోదు చేసి చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటాం. మరియు పండుగ రోజుల్లో ఇళ్లను విడిచి ఇతర ప్రాంతాలకు వెళ్లేవారు దొంగతనాలను నివారించేందుకు ముందస్తుగా పోలీస్ వారికి సమాచారం ఇవ్వాలని సూచిస్తున్నాం. ఇంట్లో విలువైన బంగారు నగలు, డబ్బులను లాకర్లో లేదా మీ బంధువుల ఇళ్లలో ఉంచుకోవాలని తెలియజేస్తున్నాం. పోలీసువారి సూచనలు పాటిస్తూ పండుగను మండల ప్రజలు సంతోషంగా జరుపుకోవాలని కోరుకుంటూ మరోసారి ప్రజలకు భోగి, సంక్రాంతి, కనుమ పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తున్నాం.



# జనతా పార్టీ అర్బన్ అధ్యక్షుడు కళ్యాణ్ తాసిల్దార్ కు అర్జీలు అందజేశారు

బుచ్చిరెడ్డిపాలెం పెన్ పవర్ జనవరి 12.
బుచ్చిరెడ్డిపాలెం మండలం నిర్వహించిన జనతా వారధి కార్యక్రమంలో భాగంగా బుచ్చిరెడ్డిపాలెం అర్బన్ అధ్యక్షులు రామిశెట్టి కళ్యాణ్ కుమార్ స్థానిక తాసిల్దార్ కార్యాలయంలో ప్రజల సమస్యలపై ఘాటుగా స్పందించారు సామాన్య ప్రజలు ఎదుర్కొంటున్న భూమి సమస్యలు రేషన్ కార్డులు ఇబ్బందులు మరియు ఇతర పాలనాపరమైన జాప్యాలపై ఆయన సమర్పించిన అర్జి మరియు అధికారులు కు అందజేశారు కాసా శ్రీనివాసులు మాట్లాడుతూ ఈ పోరాటం కేవలం ఒక అర్జీతో ఆగిపోదు ప్రతి సమస్య పరిష్కారం అయ్యే వరకు కొనసాగుతుంది ప్రభుత్వం మరియు అధికారులు బాధ్యతగా వ్యవహరించాలని ఆయన డిమాండ్ చేశారు ఈ ఈ కార్యక్రమంలో అర్బన్ అధ్యక్షుడు రామిశెట్టి కళ్యాణ్ కుమార్ రా మి శెట్టి మోహన్ జిల్లా ఉపాధ్యక్షులు కాసా శ్రీనివాసులు బిజెపి నాయకులు పాల్గొన్నారు

# అప్పలరాజు విడుదల చేయాలి

## -: ఆర్డీవో కార్యాలయం ఎదుట సీపీఎం ఆందోళన




శ్రీకాళహస్తి ,పెన్ పవర్, జనవరి, 12 :
అనకాపల్లి జిల్లాలో బలవంతపు భూ సేకరణకు వ్యతిరేకంగా రైతులు, మత్స్యకారుల తరుపున పోరాడుతున్న రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎం.అప్పలరాజుపై పెట్టిన పిడి యాక్ట్‌ను వెంటనే ఎత్తివేయాలని సీపీఎం ఏరియా కార్యదర్శి గంధం మణి డిమాండ్ చేశారు. స్థానిక ఆర్డీవో కార్యాలయం వద్ద అప్పలరాజును విడుదల చేయాలని సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. 1986లో వచ్చిన పిడి యాక్ట్ ను, ఒక రాజకీయ నాయకుడి మీద, సామాజిక కార్యకర్తపై పెట్టటం అన్యాయమని అన్నారు. వెంటనే కూటమి ప్రభుత్వం అప్పలరాజు పై పెట్టిన పీడీ యాక్ట్ ను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దాసరి జనార్ధన్, పెనగడం గురవయ్య, కుమార్, నాగరాజు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్‌లను కలిసిన ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్





గూడూరు, పెన్ పవర్,జనవరి,12:
నారావారిపల్లి గ్రామానికి విచ్చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ను గూడూరు శాసన సభ్యులు పాశిం సునీల్ కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా గూడూరు పట్టణం, గూడూరు రూరల్, చిల్లకూరు, కోట మండలాలను నెల్లూరు జిల్లాలో కలిపినందుకు ప్రజల తరపునా, తన తరపునా ముఖ్యమంత్రి కి, మంత్రి కి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ నిర్ణయం గూడూరు నియోజకవర్గ ప్రజలకు ఎంతో ప్రయోజనకరంగా ఉండనుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.అదేవిధంగా మిగిలిన మండలాలకు సంబంధించిన అంశాలను కూడా ముఖ్యమంత్రి గారు, మంత్రి లోకేష్ దృష్టికి తీసుకువెళ్లి, వాటిపై సానుకూలంగా పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ విషయంపై స్పందించిన నాయకులు అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

# గూడూరు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా స్వామి వివేకానంద జయంతి వేడుకలు

గూడూరు, పెన్ పవర్,జనవరి,12:
స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని గూడూరు కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక కాంగ్రెస్ నాయకులు స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.
ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ, యువతకు మార్గదర్శకుడిగా నిలిచిన స్వామి వివేకానంద బోధనలు నేటి తరానికి అత్యంత అవసరమని తెలిపారు. దేశభక్తి, ఆత్మవిశ్వాసం, సేవాభావం వంటి విలువలను యువత అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. సమాజంలో విద్య, క్రమశిక్షణ, నైతిక విలువల ప్రాధాన్యతను స్వామి వివేకానంద ప్రపంచానికి చాటి చెప్పారని వారు గుర్తు చేశారు.ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి పర్వతాల శ్రీనివాసులు గౌడ్, తిరుపతి జిల్లా కాంగ్రెస్ పార్టీ మైనారిటీ అధ్యక్షులు షేక్ నాయకుల ఫయాజ్,గూడూరు పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎం డి గౌస్ బాషా,గూడూరు పట్టణ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి షేక్ ఇబ్రహీం,గుదురు పట్టణ కాంగ్రెస్ పార్టీ మైనారిటీ అధ్యక్షులు షేక్ ఖలీల్ పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొని స్వామి వివేకానంద ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ప్రతిజ్ఞ చేశారు.



# చెరువుల్లో చేపల పెంపకానికి ముందుకు రాని గ్రామస్తులు

గుడ్లూరు, పెన్ పవర్,జనవరి,12:
మండలంలోని పొట్లూరు గ్రామంలో ఉన్న రెండు చెరువులలో చేపలు పెంపకానికి సోమవారం వేలంపాట నిర్వహించనున్నట్లు అధికారులు ప్రకటించారు.ఆ మేరకు సోమవారం పొట్లూరు పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేశారు. గ్రామానికి చెందిన 25 మంది ఈ వేలం పాటలో పాల్గొనేందుకు హాజరయ్యారు కానీ ఇద్దరు మాత్రమే 5 వేల రూపాయలు నగదు డిపాజిట్ చేశారు. పెద్ద చెరువుకు 85000 రూపాయలు ,చిన్న చెరుకు 40 వేల రూపాయలుగా పంచాయతీ అధికారులు మద్దతుధరలు నిర్ణయించారు. దీంతో డిపాజిట్ కట్టినవారు ఇరువురు తాము ఈ వేలం పాటలో పాల్గొనడం లేదని మద్దతు ధర తగ్గిస్తే వేలంపాటలో పాల్గొంటామని డిపాజిట్ చేసిన నగదు తిరిగి తీసుకున్నారు. ఉన్నతాధికారులతో మాట్లాడి మరోసారి వేలంపాట నిర్వహించనున్నట్లు పంచాయితీ కార్యదర్శి ఈఓఆర్డి లక్ష్మీ లత తెలిపారు. ఈ కార్యక్రమంలో చిరివెళ్ల రోసిరాజు, చిరివెళ్ల శ్రీనివాసరాజు, రామరాజు (వెల్డింగ్) ,శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.



# మార్కెట్ కమిటీ చైర్మన్ రాజన్న ఇంటిలో పట్టపగలే చోరీ

## - టీడీపీ నేతల గృహాల్లోనే వరుస చోరీలపై పలు అనుమానాలు- పోలీసులకు సవాల్ విసురుతున్న దొంగలు !



పలమనేరు,పెన్ పవర్,జనవరి 12,
పలమనేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆలకుప్పం రాజన్న ఇంటిలో పట్టపగలే దొంగలు పడి విలువైన వస్తువులు,నగలు,డబ్బు దోచుకెళ్లారు.ఈ సంఘటన గంగవరం మండలం లోని గండ్రాజుపల్లె పంచాయతీ,ఆలకుప్పం గ్రామంలోని ఆయన స్వగృహంలో సోమవారం మధ్యాహ్నం 1గంట నుండి 2గంటల మధ్యలో ఈచోరీ జరిగింది.మధ్యాహ్నం సమీపంలోని పొలం నందు పనిచేస్తున్న కూలీల వద్దకు ఆయన భార్య వెళ్లి తిరిగి వచ్చి చూడగా ఇంటి తలుపులు పగులగొట్టిన విషయం తెలుసుకుని, లోపలకు వెళ్లి చూస్తే అన్ని ముఖ్యమైన లాకర్లు,అల్మారాలు,పెట్టెలు పగులగొట్టి బంగారం, వెండి,డబ్బు తదితర విలువైన సామాగ్రి మాయమైనట్లు గుర్తించి,వెంటనే రాజన్నకు ఆమె సమాచారం అందించారు.దీంతో ఆయన గంగవరం పోలీసులకు చోరీ విషయంపై ఫిర్యాదు చేశారు.ఫిర్యాదు అందుకొన్న సిఐ ప్రసాద్ మరియు పోలీసు సిబ్బంది అక్కడకు చేరుకొని,ఎంత దొంగతనం జరిగిందన్న విచారణతో బాటు,చోరీకి పాల్పడిన నిందితులను గుర్తించి,పట్టుకునేందుకు క్లూస్ టీమ్ ద్వారా అన్ని చర్యలు చేపట్టారు.

**టీడీపీ నేతల గృహాల్లోనే వరుస చోరీలపై పలు అనుమానాలు**

సోమవారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రాజన్న ఇంటిలో చోరీ జరిగిందని తెలుసుకొన్న చుట్టుప్రక్కల స్థానికులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. నిరంతరం సీసీ టీవీ పర్యవేక్షణ ఉన్నా,పైగా జాతీయ రహదారికి సమీపంలోని ఇటువంటి గృహాలే కాకుండా, వరుసగా టీడీపీ నాయకులే లక్ష్యంగా దొంగలు చోరీలకు పాల్పడుతున్నారు.
గత కొన్ని నెలల క్రితం ఇదేవిధంగా నియోజకవర్గ పరిధిలోని రూరల్ మండలానికి చెందిన టీడీపీ నాయకులు రాంమూర్తి నాయుడు ఇంటితో బాటు పలమనేరు పట్టణంలోని సీనియర్ టీడీపీ నాయకులు, బాలాజీ సూపర్ బజార్ అధ్యక్షులు ఆర్.వి. బాలాజీ ఇంటిలో కూడా



దొంగలు పడి భారీఎత్తున బంగారం, వెండి,డబ్బులు దోచుకెళ్లారు.ఆ తరువాత పోలీసులు విచారణలో చోరీలకు పాల్పడిన అంతర్రాష్ట్ర దొంగలను పట్టుకుని, నిందితుల నుండీ సొత్తు రికవరీ చేశారు.ఇది జరిగిన రోజుల వ్యవధిలోనే,ఇప్పుడు తాజాగా టీడీపీ నాయకులు,మార్కెట్ కమిటీ చైర్మన్ రాజన్న ఇంటిలోనే చోరీ జరగడం పై నియోజకవర్గ ప్రజలకు ఈ వరుస చోరీలపై పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

**పోలీసులకు సవాల్ విసురుతున్న దొంగలు!**

పలమనేరు నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాల తెలుగుదేశం పార్టీకి చెందిన నాయకుల్లో మొదటగా రూరల్ పార్టీ నాయకులు రాంమూర్తి నాయుడు ఇంటిలో చోరీ జరిగింది.అచోరీకి పాల్పడిన దొంగలను గుర్తించి,సొత్తు రికవరీ చేసేలోపే పట్టణంలోని మరో టీడీపీ నాయకులు ఆర్వీ.బాలాజీ ఇంటిలో చోరీ జరిగింది.ఈ కేసులో చోరీకి పాల్పడిన దొంగలను పట్టుకుని, సొత్తు రికవరీ చేసి వారం కూడా పూర్తి కాకుండానే, ఇప్పుడు గంగవరం మండలం లోని మరో టీడీపీ నేత ఇంటిలో చోరీ జరగడం చూస్తుంటే .. ఇటువంటి చోరీలకు పాల్పడుతున్న దొంగలు పరోక్షంగా నియోజకవర్గ స్థాయి పోలీసులకు సవాల్ విసురుతున్నట్లు కనిపిస్తోందని చెప్పకనే చెబుతున్నారా? అలాగే అనుకొంటే నెక్స్ట్ వి.కోట,బైరెడ్డిపల్లె,పెద్ద పంజాని టీడీపీ నేతలే లక్ష్యంగా దొంగలు పావులు కదుపుతున్నారా? అని ఆయా మండలాల నేతల గుండెల్లో గుబులు రేపుతున్నాయి.కేవలం నాయకుల గృహాలే లక్ష్యంగా జరుగుతున్న చోరీలు యాధృచ్చికంగా జరుగుతున్నట్లు అనుకోవాలా? ఏమి జరుగుతోంది.దీనిపై పోలీసు అధికారులు మరింత అప్రమత్తంగా ఉండాలని, అలాగే ఇటువంటి చోరీలు కేవలం నేతల ఇండ్లతో బాటు సామాన్యుల ఇండ్లలో కూడా జరుగుతున్నాయి కాబట్టి అధికారులు అటువైపు కూడా దృష్టి పెట్టి,అందుకు పాల్పడుతున్న నిందితులపై ఉక్కుపాదం మోపాలని పలువురు కోరుతున్నారు.

# ఇంటిపై ఉన్న విద్యుత్ తీగలను తొలగించండి



పెళ్లకూరు, పెన్ పవర్, జనవరి 12
తిరుపతి జిల్లా పెళ్ళకూరు మండలం. ప్రమాదవశాత్తు ప్రమాదాలు జరిగి ప్రజల ప్రాణాలు కోల్పోతుంటే ,అధికారుల నిర్లక్ష్యంతో నివాసం ఉంటున్న ఇంటిపై విద్యుత్ తీగల ప్రమాదం పొంచి ఉందని ఆ కుటుంబీకుల భయాందోళన చెందుతున్నారు. వివరాల మేరకు తిరుపతి జిల్లా పెళ్లకూరు మండలం పెళ్లకూరు దళిత కాలనీకి చెందిన ఇర్ల హరీష్ ఇంటిపై విద్యుత్ తీగలు వేలాడుతున్నాయని బాధితుడు వాపోతున్నాడు. ఈ సమస్యను పరిష్కరించాలని గత మూడు మాసాలుగా అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడంలేదని వాపోతున్నాడు. సచివాలయ పరిధిలో జేఏల్ఎం, గ్రామపంచాయతీ కి లైన్ మాన్, వారి పనితీరు పరిశీలించేందుకు లైన్ ఇన్స్పెక్టర్ వారిపై ఉన్నతాధికారిగా ఏ ఈ ఇంతమంది సిబ్బంది ఉన్నప్పటికీ, ప్రభుత్వ జీతాలు పొందుతున్నప్పటికీ, ప్రజలకు అవసరమైన సమస్యలు పరిష్కరించకపోవడం వారి పనితీరుపై ఆ గ్రామ ప్రజలు విమర్శలు కూడా చేస్తున్నారు. బిల్లులు అయితే ముక్కు పిండి బలవంతంగా వసూలు చేస్తున్నారు, సకాలంలో కట్టకుంటే మీ ఇంటి సరఫరా సర్వీస్ కట్ చేస్తామని బెదిరింపులు కూడా చేస్తుంటారు. కానీ పేదవాడి ఇంటిపై విద్యుత్ తీగలు ఉన్నప్పటికీ, ప్రమాదం జరుగుతుందని పలుమార్లు మొరపెట్టుకున్న పట్టించుకోకపోవడం అధికారుల పనితీరుకు నిదర్శనంగా ఉంది. ఈ సమస్యను ఉన్నతాధికారులైన పరిశీలించి ప్రమాదం జరగకుండా, విద్యుత్ తీగలను ఇంటి పైనుంచి తీసివేయాలని కుటుంబీకులు మొర పెడుతున్నారు.





# పర్యాటకులు భద్రత పై దృష్టి పెట్టాలి!

సింగరాయకొండ, పెన్ పవర్,జనవరి,12:
సంక్రాంతి పండుగ సెలవులు సందర్భంగా సింగరాయకొండ మండలం పాకల బీచ్ కు వచ్చే పర్యాటకులు భద్రతగా ఉండాలని రామాయపట్నం కోస్టల్ సెక్యూరిటీ పోలీస్ (మెరైన్) ఇన్స్పెక్టర్ శివన్నారాయణ చెప్పారు. పాకల, అలగాయపాలెం, రామయ్యపట్నం బీచ్‌లకు వచ్చే సందర్శకులు మద్యం సేవించకుండా భద్రతను దృష్టిలో ఉంచుకుని మెదులుకోవాలన్నారు. పండుగ రోజుల్లో బీచ్‌లకు రద్దీ ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సముద్రంలో ఎక్కువసేపు గడపకుండా ఒడ్డున మాత్రమే స్నానం చేయాలని లోతుకు వెళ్లడం ప్రాణాంతకమని అన్నారు. సముద్రపు అలలు ఎప్పుడూ ఒకేలా ఉండవని, తీరం నుండి లోపలికి లాగే బలమైన ప్రవాహాలు ఉంటాయని ఇటీవల తుఫాన్ల కారణంగా తీరంలో ప్రమాదకర గుంటలు ఉండే అవకాశం ఉన్నందున జాగ్రత్త అవసరమని సూచించారు. మరి ముఖ్యంగా మహిళలు, చిన్న పిల్లల పట్ల కుటుంబ సభ్యులు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. యువత ఒంటరిగా లేదా పెద్దలకు తెలియకుండా బీచ్‌లకు వెళ్లవద్దని హెచ్చరించారు

# సంక్రాంతి ముగ్గుల పోటీల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి

**-- మహిళల కళాత్మక ప్రతిభకు ఘన ప్రశంసలు..**



కావలి, పెన్ పవర్,జనవరి,12:
కావలి పట్టణంలోని జూహ్రా గ్రౌండ్ నందు కావలి క్రికెట్ క్లబ్ ఆధ్వర్యంలో, సంక్రాంతి పండుగను పురస్కరించుకొని నిర్వహించిన ముగ్గుల పోటీ కార్యక్రమం ఆదివారం ఘనంగా జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కావలి శాసనసభ్యులు కావ్య కృష్ణారెడ్డిహాజరయ్యారు.కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డికి కావలి క్రికెట్ క్లబ్ సభ్యులు, స్థానిక నాయకులు ఘన స్వాగతంపలికారు.అనంతరం ఎమ్మెల్యే జూహ్రా గ్రౌండ్‌లో మహిళలు వేసిన వివిధ రకాల రంగురంగుల ముగ్గులను దగ్గరగా పరిశీలించారు. సంప్రదాయాన్ని ప్రతిబింబించే విధంగా,కళాత్మకంగా రూపొందించిన ముగ్గులను చూసి మహిళల ప్రతిభను ఎమ్మెల్యే అద్భుతంగా అభినందించారు.ప్రతి ముగ్గు దగ్గర ఆగి మహిళలతో మాట్లాడి,వారి కళాత్మకతపై ప్రశంసలు కురిపిస్తూ ఫోటోలు దిగారు.సంక్రాంతి పండుగకు ముగ్గులు ప్రత్యేక గుర్తింపని, మహిళల సృజనాత్మకత వల్లే మన సంప్రదాయాలు తరతరాలకు నిలుస్తాయని ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఇలాంటి కార్యక్రమాలు గ్రామీణ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడడంలో కీలక పాత్ర పోషిస్తాయనిఅన్నారు.ముగ్గుల పోటీల్లో విజేతలుగా నిలిచిన మహిళలకు ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి తన చేతుల మీదుగా ప్రైజ్ మనీతో పాటు



బహుమతులను అందజేశారు.పాల్గొన్న ప్రతి మహిళను అభినందిస్తూ, భవిష్యత్తులో కూడా ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలనినిర్వాహకులకు సూచించారు.ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు గుత్తికొండ కిషోర్, ప్రధాన కార్యదర్శి జ్యోతి బాబురావు, మాజీ సమస్యల చైర్మన్ కండ్లగుంట మధు బాబు నాయుడు, జనసేన నాయకుడు సిద్దు, టిడిపి నాయకులు విక్రమ్ రెడ్డి,ఆలా శీను, పద్మావతి శ్రీదేవి, కావలి క్రికెట్ క్లబ్ సభ్యులు, పార్టీ నాయకులు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని సంక్రాంతి సంబరాలను ఉత్సాహంగా జరుపుకున్నారు. ముగ్గుల పోటీలు కావలి పట్టణంలో పండుగ వాతావరణాన్ని సృష్టించి, అందరినీ ఆకట్టుకున్నాయి....

# డాక్టర్ ఉగ్రనరసింహా రెడ్డికి శుభాకాంక్షలు

## - మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దివి శివరాం




కందుకూరు, పెన్ పవర్,జనవరి,12:
కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి ఒంగోలు పార్లమెంటు తెలుగుదేశం పార్టీ అధ్యక్షులుగా నూతనంగా నియమితులైన శుభసందర్భంగా కందుకూరు మాజీ ఎమ్మెల్యే , తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ దివి శివరాం సోమవారం కనిగిరి లోని క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. డాక్టర్స్ ఇద్దరు ప్రకాశం జిల్లా రాజకీయాల గురించి సుధీర్ఘంగా చర్చించుకున్నారు. శివరాం వెంట నెల్లూరు పార్లమెంటు తెలుగుదేశం పార్టీ మాజీ అధికార ప్రతినిధి గోచిపాతల మోషే , తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కాకర్ల మల్లిఖార్జున రావు , తోకల వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

# జూనియర్ రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో వివేకానంద జయంతి

కావలి, పెన్ పవర్,జనవరి,12:
ఆత్మవిశ్వాసం,సహనం, దేశభక్తి కలిగి ఉండాలని యువతకు స్వామి వివేకానంద పిలుపునిచ్చారని డిప్యూటీ డిఈఓ,కావలి డివిజన్ జూనియర్ రెడ్ క్రాస్ నోడల్ ఆఫీసర్ యం హరిప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా జూనియర్ రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని వివేకానంద చిత్రపటానికి పూలమాల సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతీ యువకుడు ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని, ఆ లక్ష్యం చేరెందుకు కృషి చేయాలని అన్నారు. గత ఆరు నెలలుగా జూనియర్ రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో పాఠశాలలలో అనేక అవగాహనా కార్యక్రమాలు, ఆరోగ్య శిబిరాలు నిర్వహించామని, ముఖ్యంగా మాదక ద్రవ్యాల వినియోగం వలన కలిగే దుష్ప్రభావాల గురించి విస్తృతంగా కార్యక్రమాలు నిర్వహించామని పేర్కొన్నారు. కావలి రెడ్ క్రాస్ ఉపాధ్యక్షులు డాక్టర్ బెజవాడ రవికుమార్ మాట్లాడుతూ,మారుతున్న సమాజానికి అనుకూలంగా మార్పును ఆహ్వానించని ఏ వ్యవస్థ అయినా పతనం కాక తప్పదు,మార్పు ఒక ప్రవాహం లాంటిది ఆహ్వానిద్దాం అని
స్వామివివేకానంద అన్నారని, వారి బోధనలు ఎల్లప్పుడూ, యువతకు ఆదర్శనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కావలి రెడ్ క్రాస్ చైర్మన్ డి రవిప్రకాష్, వైస్ చైర్మన్ కె హరినారప రెడ్డి, పాలకమండలి సభ్యులు మరియు జూనియర్ రెడ్ క్రాస్ అడ్వైసర్ బెజవాడ ప్రసన్న కుమార్, జూనియర్ రెడ్ క్రాస్ కన్వీనర్ జి హరనాథ్, ప్రముఖ న్యాయవాది గొట్టిపాటి మనోరమ, జిల్లా పాలకమండలి సభ్యులు కలికి శ్రీహరి రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం పలువురు యువకులు రక్తదానం చేశారు




# కాకాని గోవర్ధన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన బుర్రా మధుసూదన్

కందుకూరు, పెన్ పవర్,జనవరి,12:
మాజీ మంత్రివర్యులు, నెల్లూరు జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కాకాని గోవర్ధన్ రెడ్డిని వారి నివాసంలో మాజీ శాసనసభ్యులు, కందుకూరు నియోజకవర్గం వైఎస్ఆర్సిపి ఇన్చార్జి బుర్రా మధుసూదన్ యాదవ్, మరియు కందుకూరు నియోజకవర్గ పరిశీలకులు, నెల్లూరు జిల్లా మాజీ సెంట్రల్ బ్యాంక్ చైర్మన్ సత్యనారాయణ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు.

# కోవూరు గ్రామంలో పారిశుద్ధ్య పనులు

కందుకూరు, పెన్ పవర్,జనవరి,12:
మండల పరిధిలోని కోవూరు గ్రామంలో సోమవారం స్వచ్ఛ సంక్రాంతి స్వచ్ఛ గ్రామంలో భాగంగా పనులు చేపట్టినట్లు కోవూరు సర్పంచ్ ఆవుల మాధవరావు తెలిపారు. వీధి దీపాలు మరమ్మత్తులకు గురైనట్లు గుర్తించి,వీధి దీపాలకు మరమ్మత్తులు చేయించినట్లు తెలిపారు. గ్రామంలోని అన్ని వీధుల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లించటం జరిగిందన్నారు. గ్రామస్తులు,ప్రజలు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సాధు సుందరరావు పంచాయితీ కార్యదర్శి సిహెచ్ స్వప్న తదితరులు పాల్గొన్నారు.

# బరువు తగ్గడానికి ఏది బెస్ట్..?





**హైదరాబాద్ పెన్ పవర్:** సాయంత్రం 4 లేదా 5 గంటలవుతుందంటే చాలు.. ఏదైనా కరకరలాడే స్నాక్ తినాలని మనసు లాగుతుంటుంది. ఆ సమయంలో వంటింట్లో డబ్బా తెరిస్తే మనకు కనిపించే రెండు ముఖ్యమైన ఆప్షన్లు..పల్లీలు, మఖానా. ఈ రెండూ ఆరోగ్యకరమైనవే అయినప్పటికీ.. బరువు తగ్గడం విషయానికి వస్తే ఏది మంచిది..? అనే డౌట్ అందరిలో ఉంటుంది. ఆ విషయాలు ఈ స్టోరీలో తెలుసుకుందాం..పల్లీ  శక్తి కేంద్రాలుదశాబ్దాలుగా మన ఇళ్లలో వేరుశనగలు అత్యంత ఇష్టమైన చిరుతిండి. వీటిని పేదల బాదం అని కూడా పిలుస్తారు. ఇందులో ప్రోటీన్, ఆరోగ్యకరమైన కొవ్వులు పుష్కలంగా ఉంటాయి. ఇవి తిన్న తర్వాత కడుపు నిండుగా ఉన్న అనుభూతిని కలిగిస్తాయి. తద్వారా అనవసరమైన చిరుతిళ్లు తినకుండా నియంత్రిస్తాయి. పల్లీలలో కేలరీలు చాలా ఎక్కువ. రోజుకు ఒక చిన్న గుప్పెడు తింటే పరవాలేదు కానీ, రుచిగా ఉన్నాయని గిన్నెలు గిన్నెలు తింటే బరువు తగ్గడానికి బదులు పెరగడం ఖాయం.

మఖానా: వెయిట్ లాస్ స్పెషలిస్ట్గత కొన్ని ఏళ్లుగా ఫిట్‌నెస్ ప్రేమికులకు మఖానా హాట్ ఫేవరెట్ అయిపోయింది. ఇవి చాలా తేలికగా ఉంటాయి. కేలరీలు, కొవ్వు శాతం చాలా తక్కువ. పీచు పదార్థం ఎక్కువగా ఉండటం వల్ల బరువు తగ్గాలనుకునే వారికి ఇది ఒక గొప్ప వరం. మఖానాను నెయ్యిలో లేదా నూనెలో వేయించి, ఉప్పు ఎక్కువగా కలిపి తింటే దాని అసలు ప్రయోజనం దెబ్బతింటుంది. సాధ్యమైనంత వరకు డ్రై రోస్ట్ చేయడం లేదా అతి తక్కువ నెయ్యితో వేయించడం ఉత్తమం.

బరువు తగ్గడంలో విజేత ఎవరు?బరువు తగ్గే రేసుల మఖానా ముందుంటుంది. మీరు ఒక కప్పు మఖానా తిన్నా కూడా శరీరానికి అందే కేలరీలు చాలా తక్కువ. ఇది మీ కడుపుని నింపుతుంది కానీ బరువును పెంచదు. అదే పల్లీల విషయానికి వస్తే.. ఒక కప్పు మఖానాకు సమానమైన కేలరీలను పొందాలంటే కేవలం 10-15 వేరుశనగ గింజలు తింటే చాలు. కానీ అన్ని గింజలతో కడుపు నిండిన భావన రాదు, ఫలితంగా మనం ఎక్కువ తినే ప్రమాదం ఉంటుంది.

# నిద్రలేమి సమస్యతో బాధపడుతున్నారా..?

**అయితే ఈ చిట్కాలను పాటించండి..!**

**ప్రస్తుత కాలంలో మనలో చాలా మంది నిద్రలేమి**



**హైదరాబాద్ పెన్ పవర్:** కొన్ని జాగ్రత్తలు తీసుకోవడం వల్ల మనం మన నిద్ర నాణ్యతను మెరుగుపరుచుకోవచ్చు. నిద్రించే ముందు డిజిటల్ పరికరాలను ఎక్కువగా చూడడం వల్ల నిద్ర రావడం తగ్గుతుంది. కనుక నిద్రపోవడానికి కనీసం అరగంట నుండి గంట ముందు డిజిటల్ పరికరాలను చూడడం ఆపేయాలి. దీంతో నిద్ర నాణ్యత పెరుగుతుంది. మరుసటి రోజు ఉత్సాహంగా పని చేసుకోవచ్చు. అదే విధంగా రోజూ ఒకే సమయానికి నిద్రించే అలవాటు చేసుకోవాలి. వారాంతంలో కూడా అదే సమయానికి నిద్రించేలా అలవాటు చేసుకోవాలి. నిద్రించే సమయం రోజూ మారే కొద్ది శరీరంలో ఉండే అంతర్గత గడియారం నిద్రను తిరిగి సమకాలీకరించడానికి ప్రయత్నిస్తూ ఉంటుంది. కనుక రోజూ ఒకే సమయానికి నిద్రించడం మంచిది. అలాగే నిద్రించే గది వాతావరణం కూడా సరిగ్గా ఉండేలా చూసుకోవాలి.ఉష్ణోగ్రత. .మెదడుకు సంకేతాలు ఇవ్వడంలో భౌతిక వాతావరణం కూడా ముఖ్య పాత్ర పోషిస్తుంది. గది ఉష్ణోగ్రత 18 డిగ్రీల నుండి 22 డిగ్రీల మధ్య ఉండేలా చూసుకోవాలి. గది ఉష్ణోగ్రత తక్కువగా ఉండడం వల్ల శరీర ఉష్ణోగ్రత తక్కువగా ఉంటుంది. దీంతో గాఢ నిద్ర మన సొంతమవుతుంది. అలాగే గదిలో కాంతి ఎక్కువగా లేకుండా చూసుకోవాలి. నిశ్శబ్ద వాతావరణం ఉండడం వల్ల నిద్రకు భంగం లేకుండా ఉంటుంది. నిద్రలేమితో బాధపడే వారు వారి సాయంత్రం సమయాన్ని తక్కువ సృజనాత్మక కలిగిన కార్యకలాపాలల్లో గడపాలి. దీంతో ఆందోళన, ఒత్తిడి వంటి సమస్యలు తగ్గుతాయి. లోతైన నిద్రకు మనసు తేలికగా ఉండడం కూడా చాలా అవసరం. అలాగే మరుసటి రోజు చేయాల్సిన పనులను ముందుగానే అనుకుని నిద్రించాలి. ఇలా చేయడం వల్ల ఆలోచనలు తగ్గి నిద్ర బాగా పడుతుంది.కషాయాలు..నిద్రించడానికి ముందు మూలికా కషాయాలను తీసుకోవడం మంచిది. ఇవి నాడీ వ్యవస్థను మెరుగుపరచడంలో సహాయపడతాయి. ఇక పగటి పూట మనం తీసుకునే ఆహారం కూడా రాత్రి నిద్రను ప్రభావితం చేస్తుంది. కెఫిన్ కలిగిన ఆహారాలను ఎక్కువగా తీసుకోవడం వల్ల రాత్రి నిద్ర తగ్గుతుంది. కనుక కెఫిన్ ఉండే పానీయాలను తక్కువగా తీసుకోవాలి. పండ్లు, కూరగాయలు, గింజలు అధికంగా తీసుకోవాలి. శరీరంలో విటమిన్ డి, విటమిన్ బి12 లోపాలు లేకుండా చూసుకోవాలి. ఈ విధమైన చిట్కాలను పాటించడం వల్ల నిద్రలేమి సమస్య తగ్గుతుంది. మనం నాణ్యమైన నిద్రను సొంతం చేసుకోగలం. దీంతో మన శరీర ఆరోగ్యం కూడా మెరుగుపడుతుంది.

# మినుములను చాలా మంది పట్టించుకోరు.. కానీ వీటితో ఎన్ని లాభాలు

## మినుములను చాలా మంది పట్టించుకోరు.. కానీ వీటితో ఎన్ని లాభాలు ఉంటాయో తెలుసా..?



**హైదరాబాద్ పెన్ పవర్:** మన శరీరానికి పప్పు దినుసులు ఎంతో మేలు చేస్తాయి. వీటిని తీసుకోవడం వల్ల ప్రోటీన్ తో పాటు ఇతర ముఖ్యమైన పోషకాలు ఎన్నో లభిస్తాయి. రోజూ పప్పు దినుసులను ఆహారంలో భాగంగా తీసుకోవడం మన శరీరానికి ఎంతో అవసరం. మనం ఆహరంగా తీసుకునే పప్పు దినుసుల్లలో మినుములు కూడా ఒకటి. వీటిని పొట్టుతో, మర ఆడించి పొట్టు లేకుండా కూడా తీసుకుంటూ ఉంటారు. మినుములతో మనం అనేక రకాల వంటకాలను తయారు చేస్తూ ఉంటాం. దోశ, వడ, ఇడ్లీ, కిచిడీ వంటి వాటితో పాటు సున్నుండలు, మురుకులు వంటి పిండి వంటకాలను కూడా తయారు చేస్తూ ఉంటాం. మినుములతో చేసే వంటకాలను తీసుకోవడం వల్ల మనం రుచితో పాటు ఆరోగ్యాన్ని కూడా పొందవచ్చు. మినుముల్లో ప్రోటీన్ ఎక్కువగా ఉంటుంది. వీటిని రోజు వారీ ఆహారంలో భాగంగా తీసుకోవడం వల్ల మనం అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు.జీర్ణ వ్యవస్థకు..మినుముల్లో ఫైబర్ ఎక్కువగా ఉంటుంది. వీటిలో కరిగే, కరగని ఫైబర్ కూడా సమృద్ధిగా ఉంటుంది. కనుక వీటిని తీసుకోవడం వల్ల ప్రేగు కదలికలు ఎక్కువగా ఉంటాయి. మలబద్దకం సమస్య తగ్గుతుంది. మనం తీసుకున్న ఆహారం సులభంగా జీర్ణమవుతుంది. మలబద్దకం సమస్యతో బాధపడే వారు మినుములను పొట్టుతో సహా తీసుకోవడం వల్ల మంచి ఫలితం ఉంటుంది. మినుముల్లో మెగ్నీషియంతో పాటు పొటాషియం కూడా ఉంటుంది. ఇది రక్తపోటును అదుపులో ఉంచడంలో సహాయపడుతుంది. అధిక రక్తపోటుతో బాధపడే వారికి మినుములు ఎంతో ప్రయోజనకరంగా ఉంటాయి. మినుములను తీసుకోవడం వల్ల ఎముకల ఆరోగ్యం కూడా మెరుగుపడుతుంది. మినుముల్లో క్యాల్షియం, భాస్వరం వంటి పోషకాలు ఉంటాయి. ఇవి ఎముకల ఆరోగ్యాన్ని కాపాడడంలో, ఎముకలను దృఢంగా చేయడంలో, ఎముకల సాంద్రతను పెంచడంలో దోహదపడతాయి.

ఐరన్ అధికంగా..మినుముల్లో ఐరన్ ఎక్కువగా ఉంటుంది. వీటిని తీసుకోవడం వల్ల శరీరంలో ఐరన్ లోపం లేకుండా ఉంటుంది. దీంతో శరీరంలో ఎర్ర రక్తకణాలు ఎక్కువగా ఉత్పత్తి అవుతాయి. రక్తహీనత సమస్య తలెత్తకుండా ఉంటుంది. శరీరమంతా ఆక్సిజన్ సరఫరా మెరుగుపడుతుంది. దీని వల్ల శరీర అలసట తగ్గుతుంది. తరచూ నీరసం, అలసట వంటి సమస్యలతో బాధపడే వారు మినుములను తీసుకోవడం వల్ల అలసట తగ్గడంతో పాటు శరీరానికి కావల్సిన శక్తి లభిస్తుంది. మినుముల్లో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవి ఫ్రీరాడికల్స్ తో పోరాడడం వల్ల వృద్దాప్య ఛాయలు తగ్గుతాయి. చర్మ ఆరోగ్యం మెరుగుపడుతుంది. బరువు తగ్గడంలో కూడా మినుములు మనకు దోహదపడతాయి. వీటిలో ఫైబర్ అధికంగా ఉండడం వల్ల వీటిని తీసుకోవడం వల్ల కడుపు నిండిన భావన కలుగుతుంది. దీని వల్ల మన శరీరంలోకి క్యాలరీలు తక్కువగా చేరుతాయి. తద్వారా శరీర బరువు అదుపులో ఉంటుంది.ఇతర పోషకాలు..ఇక మినుములలో జింక్, బి విటమిన్లు కూడా ఉంటాయి. కనుక వీటిని తీసుకోవడం వల్ల శరీర రోగనిరోధక శక్తి పెరుగుతుంది. వ్యాధుల బారిన పడే అవకాశం తక్కువగా ఉంటుంది. ఈ విధంగా మినుములు మన ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. వీటిని ఆహారంలో భాగంగా తీసుకోవడం వల్ల మొత్తం ఆరోగ్యానికే మేలు కలుగుతుందని వారు చెబుతున్నారు. పిల్లలకు కూడా మినుములతో చేసిన ఆహారాలను ఇవ్వడం వల్ల వారిలో ఎదుగుదల చక్కగా ఉంటుందని వారు సూచిస్తున్నారు.

## చలికాలంలో చియా సీడ్స్ అద్భుతాలు



**హైదరాబాద్ పెన్ పవర్:** చర్మానికి హైడ్రేషన్ కవచం: చియా గింజలకు నీటిని పీల్చుకునే గుణం చాలా ఎక్కువ. ఇవి తమ బరువు కంటే 10-12 రెట్లు ఎక్కువ నీటిని నిల్వ చేసుకోగలవు. వీటిని నానబెట్టి తీసుకోవడం వల్ల శరీరం లోపల హైడ్రేటెడ్‌గా ఉంటుంది.దీనివల్ల చర్మం పొడిబారకుండా, తేమతో మెరుస్తూ కనిపిస్తుంది. ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్స్ నిధి: ఆరోగ్యకరమైన చర్మానికి ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్స్ చాలా అవసరం. చియా గింజల్లో ఇవి పుష్కలంగా ఉంటాయి. ఇవి చర్మంపై రక్షణ పొరను ఏర్పరిచి, బయటి కాలుష్యం నుంచి కాపాడటమే కాకుండా చర్మాన్ని మృదువుగా ఉంచుతాయి. యాంటీ ఆక్సిడెంట్లతో యవ్వనంగా: చియా గింజల్లో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు చర్మ కణాలను దెబ్బతీసే ఫ్రీ రాడికల్స్‌తో పోరాడుతాయి. ఇది వృద్ధాప్య ఛాయలను తగ్గించి, ముఖంపై సహజమైన మెరుపును తీసుకొస్తుంది. కొల్లాజెన్ : చర్మం బిగుతుగా ఉండటానికి కొల్లాజెన్ అనే ప్రోటీన్ ముఖ్యం. చియా గింజల్లో ఉండే అమైనో ఆమ్లాలు కొల్లాజెన్ ఉత్పత్తిని పెంచుతాయి. ఫలితంగా చర్మం సాగకుండా, యవ్వనంగా కనిపిస్తుంది. లోపలి నుండి శుభ్రం: జీర్ణక్రియ బాగుంటేనే ముఖం వెలుగుతుంది అనేది అక్షర సత్యం. చియా గింజల్లో పీచు పదార్థం అధికంగా ఉండటం వల్ల మలబద్ధకం తగ్గుతుంది. శరీరం లోపల వ్యర్థాలు తొలగిపోతే, ఆ ప్రభావం నేరుగా చర్మంపై కనిపిస్తుంది. వాపులు, మొటిమల నియంత్రణ: చియా గింజలకు యాంటీ ఇన్‌ఫ్లమేటరీ లక్షణాలు ఉన్నాయి. ఇవి చర్మంపై వచ్చే ఎరుపు, వాపు, మొటిమలను తగ్గించడంలో అద్భుతంగా పనిచేస్తాయి.

# రోజూ రెండు ముక్కలు



**హైదరాబాద్ పెన్ పవర్:** బొప్పాయి.. ఎన్నో పోషకాలతో నిండిన ఈ పండు ప్రతి సీజన్‌లో దొరుకుతుంది. దీనిని రెగ్యులర్‌గా తింటే చాలా లాభాలు ఉన్నాయి. అవేంటో తెలుసుకోండి. బొప్పాయి పండు అంటే చాలా మందికి ఇష్టం. ఇందులో విటమిన్ సి, పొటాషియం వంటి పోషకాలు పుష్కలంగా ఉంటాయి. ఇవన్నీ శరీరంలో మంచి మార్పులని తీసుకొస్తాయి. రోజూ తింటే ఆరోగ్యానికి చాలా మంచిది.

జీర్ణ సమస్యలు..రోజూ ఈ పండుని తీసుకోవచ్చు. ఈ పండులో బైపాన్ ఎంజైమ్ ఉంటుంది. దీని వల్ల అజీర్ణ సమస్యలు, ఊబకాయం వంటి సమస్యలు దూరమవుతాయి. ముఖ్యంగా రోజూ పరగడపున 2 బొప్పాయి ముక్కలు తీసుకుంటే చాలా మంచిదని నిపుణులు చెబుతున్నారు.మలబద్ధకం..శరీరంలో అనేక సమస్యలకి దీర్ఘకాలిక మంట కారణం. ఇందుకోసం యాంటీ ఇన్‌ఫ్లమేటరీ ఫుడ్స్ తీసుకోవాలి. అందుకే కెరోటినాయిడ్స్ ఎక్కువగా ఉన్న పండ్లు, కూరగాయలు తీసుకుంటే మంచిది. బొప్పాయి రెగ్యులర్‌గా తీసుకుంటే శరీరంలో ఇన్‌ఫ్లమేషన్ తగ్గుతుంది.గుండె ఆరోగ్యం..బొప్పాయి పండులో విటమిన్ సి, పొటాషియం, లైకోపీన్ పుష్కలంగా ఉంది. ఇవన్నీ గుండె ఆరోగ్యానికి మంచివి. వీటిలో యాంటీ ఆక్సిడెంట్స్ గుండె ఆరోగ్యాన్ని కాపాడి చెడు కొలెస్ట్రాల్‌ని తగ్గించి హెచ్‌డిఎల్ కొలెస్ట్రాల్‌ని తగ్గించడంలో సాయపడతాయని అధ్యయనాలు చెబుతున్నాయి.క్యాన్సర్ నివారణకు..బొప్పాయిలో క్యాన్సర్ నిరోధక గుణాలు ఉన్నాయి. ఇవి క్యాన్సర్ కణాలు ఏర్పడకుండా నిరోధిస్తాయి. ఇందులోని యాంటీ ఆక్సిడెంట్స్ శరీరంలోని ఫ్రీ రాడికల్స్‌తో పోరాడి ఆడవారిలో బ్రెస్ట్ క్యాన్సర్ రాకుండా చేస్తాయి.

## మసాలా దినుసుగా ఉపయోగపడే పువ్వు..

**హైదరాబాద్ పెన్ పవర్:** అనేక లాభాలను అందిస్తుంది.. భారతీయ వంటకాల్లో సుగంధ ద్రవ్యాలకు ఎంతో ప్రాధాన్యత  భారతీయ వంటకాల్లో సుగంధ ద్రవ్యాలకు ఎంతో ప్రాధాన్యత ఉంది. వీటిని అనేక రకాల వంటకాల్లో మనం విరివిగా ఉపయోగిస్తూ ఉంటాం. మనం వంటల్లో వాడే ఈ సుగంధ ద్రవ్యాలన్నీ కూడా మన ఆరోగ్యానికి మేలు చేసేవే. మనం వాడే సుగంద ద్రవ్యాల్లో అనాస పువ్వు కూడా ఒకటి. ఇది చూడడానికి స్టార్ ఆకారంలో చూడగానే ఆకట్టుకునే విధంగా ఉంటుంది. వంటల్లో దీనిని వేయడం వల్ల వాటి వాసనతో పాటు రుచి కూడా పెరుగుతుంది. వంటల్లో వాడడంతో పాటు ఈ అనాస పువ్వు నీటిని తీసుకోవడం వల్ల కూడా మన ఆరోగ్యానికి మేలు కలుగుతుంది. ముఖ్యంగా చలికాలంలో ఈ నీటిని తీసుకోవడం వల్ల మనం అధిక ప్రయోజనాలను పొందవచ్చు. శరీరంలో రోగనిరోధక శక్తిని పెంచడంలో, బరువు తగ్గడంలో, జీర్ణక్రియను మెరుగుపరచడంలో ఇలా అనేక రకాలుగా అనాస పువ్వు నీరు మనకు సహాయపడుతుంది.

**జీర్ణ సమస్యలకు..**

అనాస పువ్వు నీటిని తీసుకోవడం వల్ల మన ఆరోగ్యానికి కలిగే ప్రయోజనాల గురించి, అలాగే ఈ నీటిని ఎలా తయారు చేసుకోవాలి.. అన్న వివరాలను వైద్యులు వివరిస్తున్నారు. అనాస పువ్వు నీటిని తీసుకోవడం వల్ల మన శరీర బరువు అదుపులో ఉంటుంది. వీటిలో ఉండే పాలీఫినాల్స్, టెర్పెనాయిడ్లు శరీర జీవక్రియలను మెరుగుపరచడంలో సహాయపడతాయి. తద్వారా శరీర బరువు నియంత్రణలో ఉంటుంది. అనాస పువ్వులో అనెథోల్ అనే రసాయన సమ్మేళనం ఉంటుంది. ఇది జీర్ణక్రియను మెరుగుపరచడంలో సహాయపడుతుంది. అనాస పువ్వులతో నీటిని తయారు చేసి తీసుకోవడం వల్ల గ్యాస్, ఉబ్బరం వంటి జీర్ణ సంబంధిత సమస్యలు కూడా తగ్గుతాయి. ఈ పువ్వులలో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. వీటితో నీటిని తయారు చేసి తీసుకోవడం వల్ల శరీరంలో రోగనిరోధక శక్తి పెరుగుతుంది. ముఖ్యంగా చలికాలంలో ఇన్ఫెక్షన్ లు ఎక్కువగా వస్తూ ఉంటాయి. ఇటువంటి సమయంలో ఈ నీరు మనకు ఎంతో ఉపయోగపడుతుంది.

**సీజనల్ వ్యాధులకు..**

ఈ నీటిని తరచూ తీసుకోవడం వల్ల జలుబు, దగ్గు, ఫ్లూ వంటి ఇన్ఫెక్షన్ లు తగ్గుతాయి. అంతేకాకుండా ఈ నీటిని తీసుకోవడం వల్ల చర్మానికి మేలు కలుగుతుంది. వీటిలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు ఫ్రీరాడికల్స్ వల్ల కలిగే నష్టం నుండి చర్మాన్ని కాపాడుతాయి. కనుక ఈ నీటిని తాగడం వల్ల చర్మం పొడిబారడం, మొటిమలు వంటి సమస్యలు తగ్గుతాయి. అనాస పువ్వు శోథ నిరోధక లక్షణాలను కలిగి ఉంటుంది. వీటితో చేసిన నీటిని క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల శరీరంలో మంట, వాపు వంటి సమస్యలు తగ్గుతాయి. ఇలా అనేక విధాలుగా అనాస పువ్వు నీరు మనకు మేలు చేస్తుంది. ఇక ఈ నీటిని తయారు చేసుకోవడం కూడా చాలా సులభం.ఒక గిన్నెలో రెండు కప్పుల నీటిని తీసుకుని అందులో 3 లేదా 4 అనాస పువ్వులను వేసి నీరు రంగు మారే వరకు బాగా మరిగించాలి. తరువాత ఈ నీటిని వడకట్టి అందులో రుచి కోసం తేనె లేదా నిమ్మరసం కలిపి తీసుకోవచ్చు. ఈ విధంగా అనాస పువ్వు నీటిని తీసుకోవడం వల్ల మనం అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు.

# 57 ఏళ్ల వయసులో అదరగొట్టిన సీవీ ఆనంద్... క్రికెట్ మ్యాచ్ లో హాఫ్ సెంచరీ!

**హెచ్‌సీఏ లీగ్ క్వార్టర్ ఫైనల్‌లో 50 పరుగులు చేసిన సీనియర్ ఐపీఎస్ అధికారి**

**సీవీ ఆనంద్ వార్మప్, బ్యాటింగ్ వీడియో సోషల్ మీడియాలో వైరల్**

**గాయాలు కాకుండా ఉండాలంటే వార్మప్ తప్పనిసరి అని సూచన**

**57 ఏళ్ల వయసులో ఆనంద్ ఫిట్‌నెస్‌పై నెటిజన్ల ప్రశంసలు**



**హైదరాబాద్ పెన్ పవర్:** సీనియర్ ఐపీఎస్ అధికారి సీవీ ఆనంద్ 57 ఏళ్ల వయసులోనూ తన ఫిట్‌నెస్‌తో అందరినీ ఆశ్చర్యపరిచారు. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ వన్డే లీగ్ ఛాంపియన్‌షిప్ క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో ఆయన ఓపెనర్‌గా బరిలోకి దిగి హాఫ్ సెంచరీ (50 పరుగులు) సాధించి యువతకు ఆదర్శంగా నిలిచారు. ఇద్దరు యువ ఫిట్‌నెస్ ట్రైనర్లు కార్తీక్, మహాదేవ్.. తన ఫిట్‌నెస్ దినచర్య గురించి తెలుసుకోవడానికి అపాయింట్‌మెంట్ అడగగా, సీవీ ఆనంద్ వారిని నేరుగా సికింద్రాబాద్‌లోని జింఖానా గ్రౌండ్స్‌కు ఆహ్వానించారు. అక్కడ విక్టరీ జట్టుతో జరుగుతున్న మ్యాచ్‌లో తన ఫిట్ నెస్ లెవల్స్ ను ప్రత్యక్షంగా చూపించారు. మ్యాచ్‌కు ముందు ఆయన వార్మప్ చేయడం, బ్యాటింగ్ ప్రాక్టీస్, ఆ తర్వాత ఓపెనర్‌గా బరిలోకి దిగి అర్ధ శతకం పూర్తి చేయడం వరకు వారు వీడియో తీశారు. ఈ వీడియోను కోచ్ కార్తీక్ తన ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేయడంతో అది వైరల్‌గా మారింది. 1991 బ్యాచ్‌కు చెందిన ఐపీఎస్ అధికారి అయిన ఆనంద్, గతంలో హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌గా సుదీర్ఘకాలం పనిచేశారు. వృత్తిపరమైన ఒత్తిడిని అధిగమించడానికి ఆయన మొదటి నుంచి క్రీడలను తన జీవితంలో భాగంగా చేసుకున్నారు. క్రికెట్, టెన్నిస్, గోల్ఫ్‌లతో పాటు యోగా, ప్రాణాయామం వంటివి తనను శారీరకం గా, మానసికంగా దృఢంగా ఉంచుతాయని గతం లో ఓ ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. తాజాగా వైరల్ అయిన వీడియోలో, మ్యాచ్‌కు ముందు ఆయన జాగింగ్, స్ట్రెచింగ్, ఆర్మ్ రొటేషన్స్ వంటి వ్యాయామాలు చేయడం కనిపించింది. "ఏ ఆట ఆడే ముందైనా తప్పనిసరిగా వార్మప్ చేయాలి. లేకపోతే గాయాల బారిన పడతాం" అని ఆయన స్పష్టం చేశారు. ఆట తర్వాత కూడా కండరాల రికవరీ కోసం స్ట్రెచింగ్ అవసరమని తెలిపారు. ఈ పోస్ట్‌పై సోషల్ మీడియాలో ప్రశంసల వర్షం కురుస్తోంది.

"ఈ వయసులో మీ ఫిట్‌నెస్ అద్భుతం. మీరు ఎందరికో ఆదర్శం" అని ఒక నెటిజన్ కామెంట్ చేయగా, "వయసుతో సంబంధం లేకుండా కేవలం ప్రదర్శన, ఫిట్‌నెస్ ఆధారంగా బీసీసీఐ మిమ్మల్ని జట్టులోకి తీసుకోవాలి" అని మరొకరు సరదాగా వ్యాఖ్యానించారు. ప్రస్తుతం తెలంగాణ హోం శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తున్న సీవీ ఆనంద్, ఉన్నత స్థాయిలో ఉన్నప్పటికీ ఫిట్‌నెస్, వర్క్-లైఫ్ బ్యాలెన్స్ విషయంలో ఎందరికో స్ఫూర్తిగా నిలుస్తున్నారు.

# బిగ్ బాష్ లీగ్‌లో పరువు పోగొట్టుకున్న పాక్ క్రికెటర్.. స్లో గా ఆడడంతో ఇన్నింగ్స్ మధ్యలోనే రిటైర్డ్ ఔట్



**హైదరాబాద్ పెన్ పవర్:** బిగ్ బాష్ లీగ్ లో పాకిస్థాన్ క్రికెటర్ మహమ్మద్ రిజ్వాన్ కు ఘోర అవమానం జరిగింది. మ్యాచ్ ఆడుతుండగానే అతడి అవసరం లేదని మధ్యలో రిటైర్ చేయడం సంచలనంగా మారింది. సోమవారం (జనవరి 12) సిడ్నీ థండర్ తో జరుగుతున్న మ్యాచ్ లో మెల్బోర్న్ రెనెగేడ్స్ ప్లేయర్ మహమ్మద్ రిజ్వాన్ వేగంగా ఆడడంలో విఫలమయ్యాడు. 26 బంతులాడిన ఈ పాక్ బ్యాటర్ కేవలం 23 పరుగులు మాత్రమే చేశాడు. రిజ్వాన్ స్లో బ్యాటింగ్ కు మెల్బోర్న్ జట్టు యాజమాన్యం విసిగిపోయింది. సదర్లాండ్ లాంటి పవర్ హిట్టర్ బ్యాటింగ్ చేయాల్సి ఉన్నా రిజ్వాన్ నత్త నడకన బ్యాటింగ్ చేశాడు. డెత్ ఓవర్లలో కూడా బ్యాట్ ఝులిపించలేకపోవడంతో చేసేది ఏమీ లేక రిటైర్డ్ ఔట్ చేశారు. దీంతో ఈ పాక్ స్టార్ బ్యాటర్ కు స్టేడియంలో ఊహించని అవమానం జరిగింది. ఈ ఒక్క మ్యాచ్ లోనే కాదు టోర్నీ మొత్తం ఈ పాక్ బ్యాటర్ పేలవంగా బ్యాటింగ్ చేశాడు. ఇప్పటివరకు ఎనిమిది మ్యాచ్‌ల్లో 101.82 స్ట్రైక్ రేట్‌తో 167 పరుగులు చేశాడు. ఒక వైపు పరుగులు చేయడంలో.. మరోవైపు దూకుడుగా ఆడడంలో విఫలమయ్యాడు. పాకిస్థాన్ టీ20 జట్టులో స్థానం కోల్పోయిన రిజ్వాన్.. బిగ్ బాష్ లీగ్ తొలిసారి ఆడుతున్నాడు. ఎన్నో అంచనాల మధ్య మెల్బోర్న్ రెనెగేడ్స్ జట్టులోకి వచ్చి ప్రతి మ్యాచ్ లో నిరాశపరిచాడు. ఈ మ్యాచ్ విషయానికి వస్తే మొదట బ్యాటింగ్ చేసిన మెల్బోర్న్ రెనెగేడ్స్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 170 పరుగులు చేసింది. హసన్ ఖాన్ 31 బంతుల్లో 46 పరుగులు చేసి టాప్ స్కోరర్ గా నిలిచాడు. ఓపెనర్ జోష్ బ్రౌన్ 35 పరుగులు చేసి రాణించాడు. థండర్ తరఫున డేవిడ్ విల్లీ, ర్యాన్ హాడ్లీ, వెస్ అగర్ తలో రెండు వికెట్లు పడగొట్టారు. థండర్ ఇన్నింగ్స్ సమయంలో వర్షం పడడంతో లక్ష్యాన్ని 16 ఓవర్లలో 140 పరుగులకు సవరించారు. థండర్స్ ఈ లక్ష్యాన్ని 15.2 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 140 పరుగులు చేసి గెలిచింది. క్రిస్ గ్రీన్ 13 బంతుల్లోనే 34 పరుగులు చేసి విజయంలో కీలక పాత్ర పోషించాడు.

# ఆ కారణంగానే టీమిండియాలో నాకు వరుస ఛాన్స్‌లు.. అసలు నిజాన్ని బయటపెట్టిన హర్షిత్ రానా



**హైదరాబాద్ పెన్ పవర్:** వడోదరలో న్యూజిలాండ్‌తో జరిగిన తొలి వన్డేలో టీమిండియా ఫాస్ట్ బౌలర్ హర్షిత్ రాణా ఆల్ రౌండ్ షో తో అదరగొట్టాడు. బ్యాటింగ్, బౌలింగ్ లో రాణించి తానొక ఆల్ రౌండర్ అనే సంగతి గుర్తు చేసే పనిలో ఉన్నాడు. కొత్త అద్భుతంగా బౌలింగ్ చేసే రానా.. లోయర్ ఆర్డర్ లో జట్టుకు విలువైన పరుగులు అందించగలడు. కివీస్ తో జరిగిన తొలి వన్డేలో మొదట బౌలింగ్ లో రెండు వికెట్లు పడగొట్టిన రానా.. ఆ తరువాతః బ్యాటింగ్ లోనూ ఆకట్టుకున్నాడు. జట్టు తీవ్ర ఒత్తిడిలో ఉన్నప్పుడు 7 వ స్థానంలో బ్యాటింగ్ కు వచ్చి 23 బంతుల్లోనే 29 పరుగులు చేశాడు. హర్షిత్ ఇన్నింగ్స్ లో 2 ఫోర్లు, ఒక సిక్సర్ ఉన్నాయి. కొంతమంది మాత్రం హర్షిత్ రానా జట్టులో అనవసరం విమర్శకులకు దిమ్మ తిరిగే సమాధానమిచ్చాడు. అసలు టీమిండియా తనకు వరుసగా ఎందుకు అవకాశాలు ఇస్తుందో తొలి వన్డే తర్వాత చెప్పుకొచ్చాడు. తనను జట్టు యాజమాన్యం ఆల్ రౌండర్ గా చేయాలని భావిస్తోందని రానా తెలిపాడు. "టీమ్ మేనేజ్‌మెంట్ నన్ను ఆల్ రౌండర్‌గా తీర్చిదిద్దాలని కోరుకుంటోంది. నా ఆల్ రౌండ్ ఆటతో నేను 8వ స్థానంలో 30 నుంచి 40 పరుగులు సాధించగలనని జట్టు మేనేజ్‌మెంట్ నాకు చెప్పింది. నేను అదే పనిలో ఉన్నాను. నెట్స్‌లో నా బ్యాటింగ్‌కు ఎక్కువ సమయం ఇస్తున్నాను". అని హర్షిత్ రానా తొలి వన్డే అనంతరం తెలిపాడు.హర్షిత్ రానాపై కొన్ని నెలలుగా విపరీతమైన ట్రోలింగ్ వస్తుంది. ఆస్ట్రేలియాతో జరగబోయే వన్డే, టీ20 సిరీస్ కు హర్షిత్ రానా ఎంపికైన దగ్గర నుంచి వ్యక్తిగతంగా నెటిజన్స్ ఈ టీమిండియా పేసర్ ను టార్గెట్ చేస్తున్నారు. జట్టులో ఎంపికవ్వడం తన తప్పు కాకపోయినా రానాపై ఈ రేంజ్ లో విమర్శలు రావడం ఆశ్చర్యానికి గురి చేస్తోంది. హర్షిత్ ను కావాలనే భారత జట్టుకు ఎంపిక చేస్తున్నారని కొంతమంది వాదించారు. ఏడాది కాలంగా టీమిండియాలో మూడు ఫార్మాట్ లలో హర్షిత్ రానా ఆడుతున్నాడు. ప్లేయింగ్ 11 లో స్థానం సంపాదించుకున్నా స్క్వాడ్ లో మాత్రం ఎంపికవుతున్నాడు. ఆస్ట్రేలియాపై జరగబోయే వన్డే, టీ20 స్క్వాడ్ లోనూ హర్షిత్ ఉన్నాడు. ప్రస్తుతం న్యూజిలాండ్ తో జరుగుతున్న వన్డే, టీ20 సిరీస్ లోనూ హర్షిత్ తన స్థానాన్ని నిలబెట్టుకున్నాడు. అయితే హర్షిత్ రానాకు వరుసగా ఛాన్స్ ఇవ్వడం కొంతమందికి నచ్చడం లేదు. దీంతో హర్షిత్ పై దారుణంగా ట్రోలింగ్ నడించింది. ప్రస్తుతం టీమిండియా హెడ్ కోచ్ గా ఉంటున్న గంభీర్ ఐపీఎల్ 2024లో కోల్ కతా నైట్ రైడర్స్ మెంటార్. మరోవైపు హర్షిత్ కూడా కేకేఆర్ జట్టు తరపున బాగా ఆడుతూ వెలుగులోకి వచ్చాడు. కేకేఆర్ తో ఉన్న అనుబంధం కారణంగానే ఆ జట్టులోని రానాకు గంభీర్ వరుస అవకాశాలు ఇస్తున్నాడని నెటిజన్స్ అనుకుంటున్నారు.

# ది రాజాసాబ్.. ఎవరెవరికి ఎంత రెమ్యునరేషన్?







బాక్సాఫీస్ దగ్గర ప్రభాస్ క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. రెబల్ స్టార్ నుంచి సినిమా వస్తుందంటే వందల కోట్ల బిజినెస్ జరగాల్సిందే. అందుకే నిర్మాతలు కూడా అడిగినంత ఇచ్చేందుకు వెనుకాడరు. సంక్రాంతి కానుకగా వచ్చిన 'ది రాజా సాబ్' విషయంలో కూడా మేకింగ్ పరంగా ఎక్కడా రాజీ పడకుండా భారీగా ఖర్చు చేసినట్లు విజువల్స్ చూస్తే అర్థమవుతోంది. హారర్ కామెడీ జోనర్ కావడంతో గ్రాఫిక్స్ సెట్స్ కోసం నిర్మాతలు భారీగానే వెచ్చించారు.

సినిమా బడ్జెట్, నటీనటుల పారితోషికాల గురించి సోషల్ మీడియాలో రకరకాల చర్చలు నడుస్తున్నాయి. ఒక పాన్ ఇండియా సినిమా రూపొందాలంటే కేవలం హీరో మాత్రమే కాదు, ఇతర నటీనటులు కూడా పేరున్న వారు ఉండాలి. ఈ చిత్రంలో బాలీవుడ్ నుంచి సంజయ్ దత్ లాంటి స్టార్ ఉండటంతో ఆయనకు కూడా భారీ మొత్తమే చెల్లించినట్లు తెలుస్తోంది. అలాగే ముగ్గురు హీరోయిన్లు ఉండటంతో వారి పారితోషికాల లెక్కలు కూడా ఇప్పుడు ఇండస్ట్రీలో హాట్ టాపిక్ గా మారాయి. ఇక అసలు విషయానికి వస్తే ప్రభాస్ సాధారణంగా ఒక్కో సినిమాకు 150 కోట్ల వరకు రెమ్యునరేషన్ తీసుకుంటారని ప్రచారం ఉంది. కానీ ఈ రాజా సాబ్ కోసం ఆయన కేవలం 100 కోట్లే తీసుకున్నారని ట్రేడ్ వర్గాల్లో టాక్ నడుస్తోంది. గ్రాఫిక్స్, విజువల్ ఎఫెక్ట్స్ కోసం బడ్జెట్ ఎక్కువగా అవ్వడంతో సినిమా క్వాలిటీ కోసం ప్రభాస్ తన పారితోషికాన్ని తగ్గించుకున్నట్లు సమాచారం. ఈ చిత్రం మొత్తం బడ్జెట్ దాదాపు 400 నుంచి 450 కోట్ల వరకు ఉంటుందని అంచనా. మిగతా వారి పారితోషికాల విషయానికి వస్తే, దర్శకుడు మారుతి 18 కోట్ల వరకు అందుకున్నట్లు తెలుస్తోంది. కీలక పాత్రలో నటించిన సంజయ్ దత్ కి 5 కోట్లు, హీరోయిన్లు నిధి అగర్వాల్ కు 1.5 కోట్లు, రిద్ధి కుమార్ కు 3 కోట్లు, మాళవిక మోహనన్ కు 2 కోట్ల వరకు చెల్లించినట్లు సమాచారం. ప్రభాస్ తన ఇమేజ్ కి తగ్గట్లుగా కాకుండా సినిమా అవుట్ పుట్ కోసం ఇలాంటి నిర్ణయం తీసుకోవడం విశేషం. బాక్సాఫీస్ దగ్గర ప్రభాస్ స్టామినా గురించి ప్రత్యేకం గా చెప్పనక్కర్లేదు. ఆయన రెమ్యునరేషన్ లో ఇలాంటి మార్పులు రావడం సహజమే. ఒక భారీ చిత్రాన్ని తక్కువ టైమ్ లో క్వాలిటీగా తీయాలంటే బడ్జెట్ సర్దుబాటు చాలా ముఖ్యం. నిర్మాతలు హీరో మధ్య ఉన్న అవగాహన వల్లే ఈ ప్రాజెక్ట్ ఇంత గ్రాండ్ గా పట్టాలెక్కింది. ప్రస్తుతం వస్తున్న కలెక్షన్లు చూస్తుంటే ఈ ఇన్వెస్ట్ మెంట్ రికవరీ అవ్వడం కష్టమేమీ కాదనిపిస్తోంది. ఇక ప్రభాస్ తన తర్వాతి సినిమాలకు మళ్ళీ తన పాత పారితోషికాన్నే కొనసాగిస్తారా లేక ప్రాజెక్ట్ బట్టి ఇలాగే నిర్ణయాలు తీసుకుంటారా అనేది వేచి చూడాలి.

Printed By Published By Gantyada Apparao On Behalf Of Gantyada Apparao, Printed At Sri Sai Ganga Printers And Publications D.No: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Prakasam, Andhra Pradesh - 523001 And Published At Shop No: 9, Bunny Xerox, Rtc Comlex, Kavali, Nellore Dist, Editor Gantyada Apparao. PRGI Registration No. "APTEL/25/A2835" e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965